రాగమయి

కూతురు ముఖం చూడగానే పలకరించటం కూడా మరచిపోయి గుడ్లప్పగించి ఊరుకున్నారు గిరిజమ్మ. జానకి కూడా గుమ్మందాటి లోనికి వచ్చి అలానే గోడనానుకొని నిలుచుండి పోయింది.

జట్కావాలా సామాను లోనికి తేవడంతో గిరిజమ్మ మేల్కొని 'ఆ పెట్టె యిలా ఇక్కడ పెట్టవోయ్' అని స్థలం నిర్దేశించి తర్వాత కూతురు వంక తిరిగి "నీ వంట్లో కులాసాగా ఉందా తల్లీ" అన్నారు నెమ్మదిగా.

జానకి తల ఊపింది. కాని తల్లి శంకాకుల హృదయాని కిదేమీ ఊరట కలిగించలేక పోయింది. ఆమె కుమార్తె పరిశుష్క శరీరాన్ని ఆపాద మస్తకం మరోసారి పరిశీలించి–

"మరీ యిలా చిక్కిపోయావేం?" అన్నారు నెమ్మదిగా.

జానకి జవాబివ్వలేదు. గిరిజమ్మగారింకొక ప్రశ్న వేసేలోగా వీధిలో నుండి శేఖరం, నూతివదద్ద నుండి ఉమా ఒకేసారి వచ్చారు. ఉమ –

"ఏమమ్మోయ్ మరదలా–" అంటూనే ఆగిపోయి జానకిని ఆపాద మస్తకం దీక్షగాచూసి – "అయితే నెల్లాళ్ళ కాపరానికే యిలా ఒరుగైపోతే ముందు ముందు నూరేళ్ళెట్లా గడుపుతావమ్మా" అంది నవ్వుతో.

నవ్వైతే సహజంగా ముగించింది కాని లోన గుండెలు కొట్టుకో సాగాయి.

శేఖరం కోటువిప్పుతూ అన్నాడు.

''చూశావా నెల్లాళ్ళయేసరికి జానకి ఎంత మారిపోయిందో! ఎవరో కొత్త వారింటికి వచ్చినట్టు ద్వారం దగ్గరే నిలుచుండి పోయింది!!"

జానకి సిగ్గుపడుతూ లోనికి నడిచింది.

జానకివెంటే తల్లీ, వదినా కూడా లోనికి వెళుతున్నారు. శేఖరం లాల్చీ విప్పుతూ అన్నాడు–

"ఏమయ్యోయ్! ఊరు నుండి వచ్చినది మీ మరదలొక్కర్తే కాదు. వీడొకడున్నాడు. నువ్వు కాస్త వీడి విషయం చూడు. తర్వాత రాత్రి పరుండే వరకూ మీ మరదలూ నువ్వూ ప్రాంతీయ, జాతీయ, అంతర్జా తీయ విషయాలన్నీ ఓపిగ్గా చర్చించవచ్చు".

శేఖరం భార్య నుండి కనీసం ఒక చిరునవ్వైనా లభిస్తుందని ఆశించాడు. కాని ఉమ ముఖాన అట్టి చిహ్నాలేమీ కనిపించలేదు. ఆమె తొందరగా తువ్వాళ్ళు వెదికి తెచ్చి యిస్తూ "వేగం రండి మరి" అంటూ తను నూతివంక నడిచింది. శేఖరం మనస్సు కాస్త చివుక్కుమంది.

2

జానకిని చూసి ఇంట్లో వారేకాక ఇరుగు పొరుగుల వారు గూడా ఆశ్చర్య పోయారు. ఆమె రాకను తెలుసుకొని సఖులు, సహపాఠినులూ చూడవచ్చారు. వారు కూడా 'అదేమోయ్...' అనేవారే.

ఈడేరిన తర్వాత కన్యలు క్రమంగా లావెక్కడం, పెండ్లయి కాపురానికి వెళ్ళాక కాస్త పలచబడటం సహజమే. కాని అలా పలచబడిన శరీరాలకు ఒక క్రొత్త చురుకుదనం, కండ్లలోకి ఒక క్రొత్త కాంతి ప్రవేశిస్తాయ్.

జానకిలో అవి లోపించటానికి తోడు ఎప్పుడూ యేదో ఆలోచిస్తూ దిగులుగా ఉంటుంది. ఆమెను రంజింప చేయటానికి ఉమ చేసిన ప్రయత్నాలన్నీ వ్యర్థమే అయాయి. ఆమె ఏదో గ్లానితో బాధపడుతోందనే విషయం స్పష్టంగా గోచరిస్తూనే ఉండెను. దానికి కారణం మాత్రం ఎవరెన్ని విధాల ప్రశ్నించినా ఆమె నుండి తెలుసుకోలేక పోయారు.

జానకికీ, చిన్నక్కకూ మధ్య చనువు అధికం. జానకి రాక పిదప వారం రోజుల తర్వాత ఆమె కూడా వచ్చింది. కాని ఆమె కూడా జానకి హృదయ మందిరాన్ని తెరువలేక పోయింది.

చివరి కొకనాడు గిరిజమ్మ విసిగిపోయి ఉత్తేజిత స్వరంతో అడిగారు.

"అయితే అత్తమామలు మంచివారయి, ఆడబడుచుతో కలివిడిగానే తిరుగుతుండీ మొగుడుతోనూ కీచులాటలు లేకపోతే – మరి నీకేం మూడిందని ఇలా వుంటావు?"

జానకి వంచిన తల ఎత్తకుండా కొంతసేపు అలానే వుండి తరువాత ఉవ్వెత్తుగా లేచి పడక గదిలోకిపోయి తలగడలోకి ముఖం దూర్చి వెక్కి వెక్కి ఏడవసాగింది. అక్కడే ఉన్న చిన్నక్కా, తల్లీ కొంతవరకూ అప్రతిభులై నిలిచిపోయి పిదప ఆమె వద్దకు పోయి ఓదార్చసాగారు. వారు ఓదార్చే కొద్దీ ఆమె దుఃఖం పెరుగుతూ వచ్చింది. చివరికేదో పనితో వంట ఇంట వున్న ఉమ వచ్చి విషయం తెలుసుకొని అత్తగారినీ ఆడపడుచునూ బయటకు తీసుకుపోయింది. కొద్దిసేపట్లోనే జానకి ఊరట పొందింది.

కాని ఆ రాత్రి మాత్రం ఆమెను ఉమ కూడా ఏ ఉపాయం చేతా భోజనం వద్ద కూర్చోబెట్టలేక పోయింది.

దానితో ఆమె విషయం మళ్ళా ఎత్తటానికి ఎవరికీ సాహసం చాలింది కాదు.

3

సంవత్సరాది ఎల్లుండనగా శేషగిరి విశాఖపట్నం నుండి వచ్చాడు. ప్రయాణపు బడలిక వల్ల మధ్యాహ్నం భోజనమవగానే పండుకున్నాడు. లేచేసరికి చాలా ఆలస్యమయింది. ఉమ రాత్రి వంట చేస్తుండటంచేత నైతేనేం, గిరిజమ్మ గారు తీరికగా ఉండటంచేత నైతేనేం ఆమే కొడుక్కు ఫలహారం పెడుతున్నారు.

జానకి తల వంచుకొని నూతివద్దకు పోతోంది. సోమరిగా ఉన్న శేషగిరి ఆమెను చూచి అన్నాడు.

"జానకేం అట్లా వుంది?"

తల్లి వెంటనే జవాబివ్వలేదు. క్షణకాలం పోయాక తమ ధోరణిలో అన్నారు.

"దాని బ్రతుకంతే!" అని క్షణమాగి– "సంగతేమిటే అంటే యేడుస్తుంది"

శేషగిరి కొంతసేపు ఊహించి చివరికొక బజ్జీ కొరుకుతూ అన్నాడు. "మీరు కోరిందదే కదూ"

గిరిజమ్మ గారికిది అలుగులా తగిలింది. కానీ ఆమె తల్లి. పైగా ఆ కొడుకు సంగతి బాగా తెలుసు. అందుచేత ఆమె ఒక గుటకవేసి ఊరు కున్నారు.

శేషగిరికి ఎదుటి హృదయం ఏ స్థితిలో ఉందో చూచుకుని మాట్లాడ్డం ఏనాడూ తెలియదు. అతడు తన ధోరణిలో పోసాగాడు.

"డబ్బు – డబ్బు – డబ్బు? చూసి ఇచ్చారు. చూడండి! ఇప్పుడు చూస్తున్నారా– మీ కుమార్తె ఎట్టి సౌఖ్యవారాసిలో ఈదులాడుతోందో?"

చూస్తుండగానే శేషగిరి ముఖం జేవురించింది. అంతేగాదు చిత్రంగా గిరిజమ్మ గారి కోపం స్థానంలో భయం ఆవహించసాగింది.

శేషగిరి మళ్ళా ఆరంభించాడు. పళ్ళు బిగించి ఒక్కొక్క ముక్కే జారవిడువ సాగాడు.

"దాని నూరేళ్ళ బ్రతుకూ – బూడిదపాలు చేశారు".

శేషగిరి ధోరణి చివరికెక్కడికి పోతుందో ఊహించి గిరిజమ్మగారు ఎలాగో ధైర్యం చిక్కబట్టుకొని అన్నారు–

"పోనీ యిప్పుడూరుకుందు – మళ్ళా రగడ పెట్టకు".

శేషగిరి వెంటనే జవాబిచ్చాడు.

"ఊరుకుంటారు! ఊరుకోక ఊరెట్టుకుంటారా!" అని కాస్తసేపాగి "– అలా ఊరుకోబట్టే చివరికిలా అయింది" అంటూ పూర్తిచేశాడు.

చివరి మాటలనేటప్పటికి అతని ఉత్తేజిత స్వరం శాంత ముఖంగా ఉంది. గిరిజమ్మ కాస్త తేలిగ్గా ఊపిరి తీసుకోగలిగారు.

శేషగిరి రెండు మూడు బజ్జీలు దిగవిడిచి కాఫీ త్రాగడం ఆరంభించాడు. తల్లి 'ఆ రెండూ తినేయకూడదూ?" అంటుండగానే కాళీ కప్పు క్రిందపెడుతూ అన్నాడు.

"ఏ యింట్లో ఆడుదాని పెత్తనం తలెత్తుతుందో ఆ యింట సుఖం సంతోషం అనేవి మరి ఉండవు–" అంటూ లేచి "– స్త్రీ బుద్ధిః ప్రళయాంతకః అని పెద్దలు చెప్పింది వట్టివేనా?" అని ప్రక్కకు తిరిగాడు.

ఎదురుగా ఉమ రెండు చేతుల మధ్యా అన్నపు గిన్నెతో నిల్చుని ఉంది.

క్షణకాలం ఆ ముగ్గురి ముఖాలు రంగులు మార్చుకున్నాయి. చివరకు పెద్దావిడ గిరిజమ్మ ముందుగా తమ ముఖానికెక్కిన కాళిమను చెరుపు కుంటూ అన్నారు.

"ఊహ్ పోదూ!... వెధవ సోది కబుర్లూ నువ్వూను.. అవతల వదిన చేతిలో బరువుతో కూడా నిలుచుండి పోయింది"

కాని ఉమ యేమీ అమాయకురాలు కాదని వాళ్ళిద్దరకూ తెలుసు. అంతేకాదు తేలిగ్గా బయటపడే తొందరపాటు మనిషి కూడా కాదు.

4

ఆఫీసులకు పోయేవారుండడం చేత పంతులుగారి యింట వంటలు వేగమే అవుతాయి. కాని ఆవేళ సంవత్సరాది వంటలు. అందుచేత పూర్తయే సరికి పన్నెండూ వేశారు.

పెద్దలు కూడా విస్తరి ముఖం ఎంతట చూస్తామా అన్నట్టుండటం చేత పిల్లలూ పెద్దలూ, పిలిచిందే తడవుగా పీటల మీద కూర్చున్నారు.

గృహమేధి ఆదినారాయణ మూర్తి గారు పట్టుపంచతో నుదుటను గంధాక్షతలతో, పంక్తి మొదట ఇద్దరికి సరిపోయే పెద్ద పీట మీద కూర్చున్నారు.

ఆయన పక్కగా అంతకు ముందు రోజునే వచ్చిన రెండవ అల్లుడూ, పెద్ద కొడుకు శేఖరం, చిన్నవాడు శేషగిరీ వరుసగా కూర్చున్నారు. ఆ సరసను శేఖరం కొడుకూ, కూతురూ, తర్వాత రెండవ అమ్మాయి బిడ్డ లిద్దరూ వున్నారు. వారి ప్రక్కగా తల్లి కూర్చుంది. చివరను జానకి.

అత్తా కోడళ్ళిద్దరూ తొందరగా వడ్డిస్తున్నారు.

వడ్డన జరుగుతున్నంతసేపూ పెద్దవాళ్ళంతా మౌనంగా కూర్చున్నారు. పిల్లలు మాత్రం గొడవ చేస్తున్నారు. ఉమ బిడ్డలిద్దరూ ఒక పక్షంగానూ, రెండవ అమ్మాయి బిడ్డలిద్దరూ

ప్రతిపక్షంగానూ 'మా చిన్నాన్న' అంటే 'మా చినమామయ్య' అని, మా చిన్నత్తంటే మా పిన్ని అని, నాకు కూర ఎక్కువంటే నాకు పప్పు ఎక్కువనీ, నాది పెద్ద కంచమంటే నాది వెండి కంచమనీ 'గిల్లికజ్జాలు' పెట్టుకు వాదులాడుకుంటున్నారు.

చివరకు తొలివడ్డన పూర్తయింది. పంతులుగారు అభిఘారం కాగానే మహా నైవేద్యం కానిచ్చి పరిషిస్తూ ప్రక్కనున్న అల్లుడితో సాభిప్రాయంగా 'ఊ ఊ' అని, మనుమల్ని హెచ్చరించారు.

"ఇంక ప్రజ్ఞలన్నీ కంచాల మీద చూపాలి. ఏదీ ఏదీ, ఎవరు ఎక్కువగా, తొందరగా గబగబా తింటారో చూదాలి!"

ఈ హెచ్చరికతో పిల్లలు చప్పున కంచాలలో చేతులు పెట్టారు. పదార్థాలు వేడిగా ఉన్నాయేమో చేతులు చురికాయి. "అమ్మో! ఊప్" అంటూ చేతులు విదిలించి వేళ్ళు నోట్లో పెట్టుకున్నారు.

తొందరపడని ఉమ కూతురు చేయి కాలలేదు. ఆమె తక్కిన వాళ్ళ వంక కుతుకంగా చూస్తూ మౌనహాసం చేసింది.

మనుమలందరి వరుసా క్రీగంట కనిపెడుతున్న తాతగారు నవ్వకుండా తనేమీ చూడనట్టు నటిస్తూ అడిగారు.

"ఏమమ్మా సరస్వతీ నువ్వు తినవేం?"

సరస్వతి తాత ముఖంలోకి వంగి చూస్తూ అంది.

"ఎక్కువ తింతే ఏమిత్తాలు?"

నలుగురూ పకాలున నవ్వారు. అయితే ఆ బాలముఖం చిన్నబుచ్చు కోటానికి బదులు తనూ నవ్వింది. కాని ఆ నవ్వులో కాంతిలేదు.

నవ్వకుండా ఊరుకున్న రెండవ అమ్మాయి అంది –

"దీనికి ప్రతిదానికీ లంచం గావాల్రా... లంచగొండి భడవ!"

ఈ విమర్శకెవ్వరూ జవాబివ్వలేదు. కాని ఇది ఎక్కడో ఒక హృదయాన్ని గాయపరుస్తుందని జానకి భయపడింది.

ఎక్కువ తిన్నవాళ్ళకి ఆ రాత్రి తమ పక్కలో నిద్రించేందుకు స్థానం దొరుకుతుందని తాతగారు ప్రకటించగా మనుమలంతా పోటీ ఆరంభిం చారు.

కొంతసేపటి వరకూ 'కావాలి' 'చాలు' 'మరి కొంచెం' మొదలైన అత్యావశ్యక పదాలు తప్పిస్తే ఎవరూ ఏమీ మాటాడలేదు. కాస్త తాపీ చిక్కాక పంతులు గారన్నారు –

"రాజశేఖరం కూడా వచ్చేస్తే అక్కడకు లోటు లేకపోను".

ప్రక్కనున్న అల్లుడు పరధ్యానపు మనిషి. సరిగా వినిపించుకోక మామ గారి ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూశాడు.

"... మీ తోడల్లుడి మాట! అతడు కూడా వచ్చేస్తే తీరిపోను!"

ఈసారి వినిపించి ఉంటుంది. అందుచేత తల ఊపుతూ "అవునవును అంతే". అని తరువాత యింకేమీ తోచకపోయే సరికి విస్తరాకు వంక తిరిగాడు.

మామగారు కొంతసేపు శూన్యదృక్కులతో ఎక్కడెక్కడో చూస్తూ అలానే వెనుకటి వాక్యం అందుకుంటూ అన్నారు–

"... అక్కడకు మా జానకమ్మ ముఖం కూడా కలకలలాడుతుండును" అంటూనే ఆయన జానకి ముఖంలోకి ఒకసారి చూసి పిదప ఆలోచనలో పడ్డారు.

అల్లుడు, మామగారు తనను మభ్యపెట్ట చూస్తున్నారా లేక నిజంగానే ఆయనకు తెలియదా, అని ఆలోచిస్తున్నాడు. తక్కిన వాళ్ళు కూడా ఏమీ మాట్లాడలేదు. నిశ్శబ్దంగా, భోజనాలవుతున్నాయి.

శేషగిరి ప్రక్కనున్న మనుమడేదో అడిగాడు. గిరిజమ్మ వడ్డిస్తున్నారు. శేషగిరేదో గొణిగాడు. తల్లి తీక్షణంగా చూసింది. కాని కొడుకు గమనించ లేదు. ఇదంతా చూస్తున్న పంతులుగారు అడిగారు.

"ఏమిటీ?"

లోపలి నుండి వస్తున్న కోడల్ని గమనిస్తూ గిరిజమ్మ మాటాడకుండా లోనికి వెళ్ళిపోయారు. పంతులుగారలాగే మౌనంగా ఉండి ఉండి అడిగారు.

"నువ్వు కూడా చిన్నతనంలో యిలానే ఉండేవాడి వోయ్ బుచ్చిబాబు?"

అల్లుడు తలెత్తి చూస్తూ అన్నాడు,

"అంటే?"

మామగారు నవ్వుతూ అన్నారు–

"మూర్ఖత్వం! తాబట్టిన కుందేటికి మూడే కాళ్ళనడం!!"

బుచ్చిబాబు జవాబివ్వలేదు. స్ఫురించక కాదు – లేకా కాదు – రాజుతున్న మంటకా జవాబు ఆజ్యధార అవుతుందని. కాని పంతులు గారూరుకోలేదు.

"ఆ వయస్సులాంటి దనుకుంటాను లేక కొంతమంది తత్వమో!?..." కొంతసేపాగి.

"– ఈ పుస్తకం ఆ పుస్తకం చదవడం – అంతటితో పెద్ద లోకానుభవం సిద్ధించినట్టు మాట్లాడటం!!!"

తమ స్వరం చిక్కబడుతుండటం గుర్తించారేమో పంతులుగారు ఆగి పోయారు.

తర్వాత కాస్త శాంతించాక మళ్ళా ఆరంభించారు. ఈసారి నెమ్మదిగా –

"భర్తృహరే కాబోలు అంటాడు - 'తెలివి కొంచెం కూడా లేనప్పుడు అంతా తెలుసునని గర్వంగా ఏనుగులా తిరిగాడట. తర్వాత మహానుభావుల పరిచయమై వాళ్ళు కాస్త కనువిప్పు కలిగించగానే ఆ గర్వమంతా ముక్కలైపడగా నాకు తెలిసిందేమీ లేదే అని గుండె కొట్టుకున్నాట్ట'... అలా ఉంటుంది వీళ్ళ వ్యవహారం.

వీడే కాదు. ఆ వయస్సులో అంతా అలానే అగపడతారు. పోనీ వయస్సు మహాత్యమే అనుకుందామంటే అందరూ అలా అగపడరు. పెద్ద వాడున్నాడు కదూ - వాడెప్పుడూ యిలాటి మిడి మిడి జ్ఞానం ప్రకటించ లేదు" అని నవ్వి "వీడికే..." అంటూ తన విస్తట్లో వడ్డిస్తున్న భార్య వంక చూస్తూ పూర్తిచేశారు. "కాస్త మేనమామ పోలిక వచ్చింది".

కాని గిరిజమ్మగారీ ఆహ్వానాన్ని అందుకోలేదు.

ఆదినారాయణగారు సాధారణంగా ఎల్లప్పుడూ హాస్యరస వాతావరణం లోనే ఉంటారు. దానికి తక్కిన వారంతా యధాశక్తి తాళం వెయ్యడం పరిపాటి. కాని ఆవాళ అంతవరకూ వాతావరణం బహు కటువుగా ఉండేసరికి అందరూ నీటి ఒడ్డున పడేసిన చేపల్లా ఉంటూ వచ్చారు. చివరికెలానో ఆయన గాలిని మార్చబూనారు. అయితే అట్టి సమయాన చేయూతనిచ్చే గిరిజమ్మ గారానాడు ఎందుచేతో మౌనం వహించారు. ఇది గమనించి బుచ్చిబాబే అందుకున్నాడు.

"మీరు చుట్టూ తిరిగి అత్తగారి మీద పడతారేం?"

పంతులుగారు ఉచ్చస్వరంలో ఎదుటి మాట క్రింద పడకుండా అందుకున్నారు.

"మరెవరి మీద పడమన్నావ్!..."

"చచ్చిపోయిన మామగారి మీదా, అత్తగారి మీదా పడలేం కదా? మరదళ్ళు పడనివ్వరు కదా? పోతే యిదీ, దీని తమ్ముడే నాకు దక్కారు".

పంతులుగారిలా మోటు సరసాలాడడం అప్పుడప్పుడు అలవాటు. కాని అట్టి సమయాల్లో యెవరూ మాటాడరు. కొంతసేపు పోయాక పంతులుగారే అన్నారు.

"వీళ్ళ తమ్ముడు కూడా చిన్నప్పుడు మహా నీలిగేవాడులే. తర్వాత పెళ్ళవగానే ఆ ఆట కట్టేసింది" అంటూ చిన్న కొడుకు ముఖంలోకి చూసి చిన్నపోయి ఉండటం గుర్తించి "- అలా వీడికీ ఒకతెను కట్టేస్తే సరి పోతుంది" అంటూ నవ్వారు. కాని శేషగిరినిగాని ఇంకొకరిని గాని ఈ కవ్వింపు పులకరింపజేయలేదు.

మామ గారికి సహాయపడే ఉద్దేశంతో బుచ్చిబాబన్నాడు-

"మీరు ఊ అంటే ఈ వైశాఖ మాసంలోనే అయిపోతుంది"

పంతులుగారు గట్టిగా నవ్వుతూ అన్నారు-

"నేను 'ఊఁ' అనడమేమిటి మధ్య! ముసలివాణ్ణి కూడానూ!! వాడు ఊ అనాలి"

"అతడికిష్టమే మీ ఆటంకం లేకపోతే..." మాట పూర్తికాకుండానే పంతులు గారన్నారు.

"అలా అని నీతో చెప్పేడేమిటి?"

"సంవత్సరం క్రిందట చెప్పాడు"

"నేను రెండు సంవత్సరాల క్రిందట అనుజ్ఞ ఇచ్చాను".

తక్కిన వారెవ్వరూ నవ్వకపోయినా అల్లుడు మామలు మాత్రం తమ హాస్యానికి తామే వినోదిస్తున్నారు. అల్లుడన్నాడు.

"సరే.. అయితే రేపే సంబంధం కుదురుస్తాను" అంటూ బావ వంక తిరిగి "అయితే చిన్నబావా! నీకు తెల్లపిల్ల కావాలా? నల్లపిల్ల కావాలా" అన్నాడు దీర్ఘాలు తీస్తూ.

శేషగిరి జవాబిస్తాడని ఒక్కరు కూడా అనుకోలేదు. కాని అతడు జవాబిచ్చాడు శాంతి దీర్ఘ స్వరంతో "నాకా. బాగా డబ్బున్న పిల్లకావాలి" అని, క్రమంగా హెచ్చే స్వరంతో పూర్తిచేశాడు. "తెల్లనిదైనా, నల్లనిదైనా, చదువుకోని నిరక్షరకుక్షైనా - పల్లెటూరి పశువైనా - డబ్బుంటే చాలు. అదొక్కటే ముఖ్యం".

అందరూ స్తంభించిపోయారు. శేషగిరి మాత్రం తొందరగా చేయి కడుగసాగాడు.

వారిలో చైతన్యం కోలుకొనేసరికీ వంటింటిలో టంగ్‌న పళ్ళెం ఎత్తివేసిన చప్పుడవడం, వెనువెంటనే రెచ్చగొట్టబడిన పులి గుహను వీడి వచ్చినట్టు ఉమ బయటికి రావడం, చేయి కడుక్కున్న శేషగిరి నిష్క్రమించటం అతి త్వరగా ఒకే క్షణాన జరిగినట్టు జరిగిపోయాయి. కాని ఉమ మరిదిని విడువలేదు. తడబడే కాళ్ళతో అతని వెంటనే నట్టింటిలోకి వెళ్లింది. కాని అప్పటికప్పుడే శేషగిరి వీధి తలుపు చప్పుడు చేస్తూ మూసుకొని బయటకు వెళ్ళాడు.

5

చివరికా అగ్ని పర్వతం బ్రద్దలవటం ఎలాగూ తప్పలేదు. శేషగిరి చెయ్యి దాటిపోవడంతో ఆమెలోని ఉక్రోషం మరీ రెచ్చి పోయింది. అత్తమామలూ, భర్తా, ఆడబడుచులూ తనను గమనిస్తున్నా లక్ష్యం చెయ్యకుండా దురిత గమనంతో వెనుకటింటిలోకి పోయి అక్కడ వాల్చి వున్న పీటమీద చతికిల పడింది.

కోపం అణచుకోవాలనే విషయం ఆమెకు తెలుసు. అయినా ఏవో జ్ఞాపకాలు వచ్చి ఆమె కోపాన్ని ఉత్తేజపరుస్తూనే

వచ్చాయి.

సరిగ్గా యిలాంటి సమయంలోనే రెండవ ఆడపడుచు వచ్చి ద్వారం తెరిచింది.

"అయితే వదినా మీ అన్నదమ్ములూ, అప్పచెల్లెళ్ళూ, మామగారూ కలిసి మాకు పండగ లేకుండా చేస్తారేమిటి?... చెపుదూ?... ఏమిటి మీ ఉద్దేశం!" అని క్షణమాగి "ఊరికేనే ఎత్తి పొడుపు మాటలన్నీ అని నాన్నగారు వాడిని గాయపరిచారు. దాని మీద ఈయనగారు ఊరు కోకుండా మహా పెద్ద తెలివైన వాళ్ళలా తెలిసీ తెలియని హాస్యాలాడి వాడ్ని రెచ్చగొట్టారు. అసలే కోతి, అందులో కల్లు తాగింది. దానిమీద తేలు కుట్టింది. పైగా దానిచేత నిప్పు కూడా తొక్కించారు – ఏదో చిందులు తొక్కింది. ఇప్పుడు నువ్వు కూడా ఆ కోత్తో సమంగా చిందులువేసి ఇల్లు భీభత్సం చెయ్యదల్చుకుంటే చెప్పు?"

ఇట్టి ప్రౌఢోపశమన వాక్యాలతో కొంతమంది కోపం తగ్గుతూ వుంటుంది. కాని ఉమ కోపం ప్రత్యేకించి ఆవేళ దాని ఉన్నతోన్నత పథాలంటింది.

కోపం తొణికిసలాడగా మెఱసే పెద్దకండ్లలో నుండి రూక్షంగా చూస్తూ దీర్ఘోచ్ఛ్వాస నిశ్వాసాలతో మూసి వున్న పెదవులు విప్పుతూ అంది.

"అయితే తప్పంతా మాదే అంటారు".

ఆ స్వరం, ఆ ముఖం వినగా కనగా ఎదుటి మనిషికి భయమే వేసింది. కాని తాను ఆడపడుచవటంచేత వెనుకంజ వేయటం నామోషి! అందుచేత అంది.

"కాదూ! వయసు మాటెలా ఉన్నా నీ కొడుకువంటి వాడు మరిది. వాడి మాటలకు కోపగించుకోవడం తప్పు కదూ?"

శతాబ్దాల తరబడి మహా తప జ్వాలలు గర్భకుహరాలు భరిస్తుండీ మూగగా కనుపించే అగ్ని పర్వతాలు చివరికొకనాడు ప్రళయ భీభత్స ధ్వనులతో పగిలేటప్పుడు ఎవరి ఆజ్ఞలూ, గౌరవాలు కూడా నిలువవు. సమీపంలో చిక్కుకున్నప్పుడు, సృష్టికర్తే అయినా, సృష్టి భర్తే అయినా ఆ ఉడుకుముద్దలు మీద పడగా బాధ పడవలసిందే.

ఉమ వదనగహ్వరాల నుండి పొగలు, శగలూ ఉమియస్తూ విరుచుకు పడింది.

"నా కొడుకా? అదే నా కొడుకైతే రెండు చెవులూ పట్టుక యీడ్చుక వెళ్లి వాడి ముందర కుదేసి 'చెప్పవయ్యా' ఇతడికేం లోపం వచ్చిందో చెప్పనేదాన్ని. అంతేగాని ఎవరిలానూ వెనుక వేసుక వచ్చేదాన్ని కాదు. ఇలా అందరూ, వెనక వేసుక రాబట్టే ఆయన అనవలసిన మాటా అనరాని మాటా తెలుసుకోకుండా తాను దేనితో చెలగాటం ఆడుతున్నదీ కూడా ఎరుగక నోటికి వచ్చినట్టల్లా మాటాడుతున్నాడు. దాని నూరేళ్ళ బ్రతుకూ బూడిదపాలు చేశారట. ఎవరు చేశారూ? తను చేస్తున్నారు ఎవరి ముందే మాటనాలో తెలుసుకోకుండా తెలివి తక్కువగా మాట్లాడి అభమూ, శుభమూ, ఎరుగని పిల్ల మనసు పాడుచేసి ఆమె సంసారాన్ని అగ్ని గుండంగా మారుస్తున్నది అతను కాని, నే కాదు".

క్షణకాలం ఆగి – "ఆడ పెత్తనం అంట. స్త్రీ బుద్ధిః ప్రళయాంతకఃట! నా పినతల్లి కొడుకని చెప్పి నేనేం ఎవరికన్నూ మూసి చెయ్యలేదే యీ పెళ్ళి – వాళ్ళ ఆస్తిని గూర్చికాని, వాడి చదువును గూర్చిగాని, వాడి ప్రవర్తన గూర్చిగాని నే చెప్పిన మాటల్లో ఒక్క అక్షరం తప్పని ఋజువు చేస్తే నా కుత్తుక ఇస్తాను. అటువంటప్పుడు..."

అప్పుడే వచ్చిన గిరిజమ్మగారు మాట మధ్యలో అన్నారు– "వాడు నిన్నన లేదే ఆ మాటలూ – నువ్వెందుకలా తడుము కుంటావ్?"

పెద్దతనం అండగా ఆడిన ఈ అబద్ధంతో ఉమ శరీరాన్ని పూర్తిగా మరిచిపోయింది. తారక స్థాయిలో అరవసాగింది.

"అనలేదూ! అనలేదూ! తల్లి అయినంత మాత్రాన మీ కొక్కరికే అభిమానం ఉంటుందనుకోకండి. నిజంగా మీరే ఆ కుర్రాణ్ణి నానా అబద్ధాలూ ఆడి చెరుపుతున్నారు. అతని పిచ్చిమాటలూ, తెలివి తక్కువ వ్యవహారాలూ అన్నీ మామగారికి తెలిసి ఉంటే ఏనాడో అతణ్ణి చక్కపరచి ఉండేవారు.

ఈ పెళ్ళి అతనికి ఇష్టంలేక పెళ్ళి ముందు దొంగ టెలిగ్రామ్‌లు సృష్టించి పెళ్ళికి వుండకుండా అతను వెళ్ళిపోతే ఆ విషయం మీకు తెలిసే మామగారికి చెప్పకుండా దాచిపెట్టి ఆయన కబద్ధాలు చెప్పారు.

ఆనాడే ఈ విషయం ఆయనకు తెలిస్తే కొడుక్కి ఇష్టంలేని పెళ్ళి మానివేసే వారో లేక అతనికి నచ్చచెప్పి ఒప్పించేవారో..."

ఆమె అకస్మాత్తుగా ఆగిపోయింది.

ఉమ కోపతాపాలకు లోనై అంతరంగంలో రగులుతూ వచ్చిన అగ్ని జ్వాలలన్నీ వెలిగక్కుతునే ఉందిగాని, అంతసేపూ "తొందర పడుతున్నావ్?" "ఒద్దు" అంటూ అంతరంగంలో హెచ్చరికలు వినవస్తున్నాయి. కాని ఆ వివశత్వంలో, ఆగలేకపోయింది. అత్తగారిపై ఒక్కొక్క మణుగురాతి మాటా విసురుతూనే ఉంది గాని ప్రతిమాటా విసిరిన వెంటనే హెచ్చరిక వినవస్తూనే ఉండెను. అయినా నిలద్రొక్కుకోలేక

పోయింది. చివరికి జేవురించిన ముఖంతో రక్తారుణ నేత్రాల నుంచి విస్ఫులింగాలు రాలుస్తూ ఎదురుగా భర్త కానవచ్చేసరికి అప్పటికే కొంత పిరికిమందు మేసిన హృదయం ఒక్క అదటున దిగజారి పోయింది. అతనితో కూడా పోరాడవలసిందేనని అనుకున్నా ధైర్యం ఏమాత్రం కూడా సమకూరింది కాదు.

చూస్తుండగానే ఆమె ముఖంలో చేరుకున్న రక్తమంతా కాళ్ళలోకి, పాదాలలోకీ పరుగులు తీసింది. పెదవులకు బదులు కాళ్ళు చేతులు కంపింప సాగాయి. హృదయకుహరం పదిరెట్లెక్కువగా పనిచేయసాగింది.

శేఖరం అన్నాడు–

"ఏం ఊరుకున్నావ్, కానీ యింకా"

ఉమకు యింకా అతని కండ్లలోకి చూడ్డం అసాధ్యమనిపించింది. అతడు తల వూపుతూ అడిగాడు.

"నువ్వు ఈ పెండ్లి సంబంధంగూర్చి మొట్టమొదట నాతో అన్నప్పుడే నేను చెప్పానా?... నువ్వేమన్నావ్? 'వాళ్ళిద్దరూ నాకు బహిఃప్రాణాలు. వాళ్ళకు పెళ్ళయితే నాకంతకు మించిన సంతోషం మరి ఉండదన్నావ్' దాని మీద నేనన్న మాటలు నీకానా డొక్కటైనా తలకెక్కాయా? ఇప్పుడవన్నీ ప్రత్యక్షంగా అగుపడుతున్నాయా?"

జంఝామారుతానికి కంపించే లతలా ఆపాదమస్తకం చమటలు కారుస్తూ తెల్ల ముఖంతో నిల్చున్న భార్యను చూస్తుండగా శేఖరానికొక వంక నుండి జాలి పీడించసాగింది. అంతేకాక ఆమె పౌరుష స్వభావం జడిపింప సాగింది. అయినా అతడు ఆగలేదు.

"వాడికి తోచిందేదో వాడన్నాడు. అది పొరపాటైతే నిజంచూపి బోధించు అంతేగాని పౌరుషం దేనికి?"

"నీ పినతల్లి కొడుకునంటేనే నీకంత పౌరుష మేడిసినప్పుడు వీడినంటే మాకు కోపం రాదూ?"

ఆ సరికి ఉమ చెవులలో ఒక్కమాటైనా పడటం లేదు. అల్లాగే వెడు తున్నాయి.

తర్వాత ఏ భావం తలలో మెరిసిందోగాని, శేఖరం అకస్మాత్తుగా కోపోద్రిక్తుడై దంత ఘట్టనం చేస్తూ అన్నాడు.

"చెప్పు! 'మాకు కోపం రాదా?' అంటాను".

ఉమ జవాబివ్వలేదు. యింక ఆమె ఒంటి మీద దెబ్బ పడిపోతుందనగా పంతులుగారు జవాబిచ్చారు.

అంతవరకూ ఒక చీపురుపుల్ల పుచ్చుకొని పళ్ళు కుట్టుకుంటూ, అధో దృష్టితో, తనకా పోట్లాటతో ఎట్టి సంబంధం లేదన్నట్టుగా ఓ ప్రక్కగా ఉంటూ వచ్చిన ఆయన, శేఖరం చివరి ప్రశ్న వినగానే మరేమనుకున్నారో చేతిలో పుల్ల అకస్మాత్తుగా పారవేసి కొడుకు నుద్దేశిస్తూ అన్నారు–

"ఊ, నే చెపుతానురా. ఏమిటి నీ ప్రశ్న?"

అతనిలా ప్రతిపక్షంలో అడుగు పెట్టడంతో అతని గొంతు శాంతంగానే ఉన్నా శేఖరం కళ్ళెం లాగినట్టు ఆగిపోయాడు. పంతులు గారిది గమనిస్తూనే అన్నారు.

"వాళ్ళ పినతల్లి కొడుకునంటే దానికి కోపం వచ్చినట్టు మీ తమ్ముణ్ణంటే కోపం రాదా అంటావు? అదేనా నీ 'లా' పాయింటు?

సరే దానికి జవాబు విను.

వాళ్ళన్నను, మీ తమ్ముడు అన్నదానికి ఒక్క ఆధారం లేదు. నిజానికి అతన్ని అనడానికి – ఈ వెధవాయి అతడి కాలిగోరును పోలడు. నాలుగు ఇంగ్లీషు ముక్కలు రాగానే యీ వెధవాయికి వచ్చి ఏడిసినది ఏమిటి? మనిషితో ఎట్లా మాట్లాడాలో, ఎదుటి వారిని ఎలా గౌరవించాలో కూడా తెలియదు. ఏ మాటకే అర్థమో తెలియదు. వీడు ఇంటరు వెలిగిస్తున్నాడని వీడి నీలుగు. కాని వచ్చిందేమిటీ? తెలుగు కావ్యాల కర్థంకాదు – కావ్యనామాలకు అర్థం చెప్పమనూ? ఇంక ఇంగ్లీషు – చిలక పలుకులు తప్పితే వీడికి అందులో మాత్రం తెలిసిందేమిటీ?

ఇంక అతడు

తెలుగులో అతను చదువని కావ్యం లేదు. పైగా వీడికి ఇంగ్లీషు భాష తెలుస్తే ఆయన సంస్కృతంలో పంచకావ్యాలు క్షుణ్ణంగా చదువుకున్నాడు.

ఏం చూసయ్యా వీడి నీలుగు?"

క్షణకాలం ఆగి–

"వీడికంటే, ఈ పూటకుంటే ఆ పూటకు గతిలేదు. నాకీ ఉద్యోగం ఏడిసి నన్నాళ్ళే వీడి మిడిసి పాటంతా. పొట్ట పోషించుకోవడానికి పట్టాలుంటేగాని గతిలేదు కాబట్టి చదివిస్తున్నాను. అతడికేం మహారాజు! వీడిలాటి వాళ్ళను పదిమందిని పోషించగలడు! అందుచేతే అతను వీడి బానిస చదువుకు తల ఒగ్గలేదు. అంతేగాని ఏదో జులాయిగా తిరిగీ, తెలివితేటలు చాలకా, సోమరితనం చేతా కాదు.

వీడు పదేళ్ళు అతని దగ్గర శుశ్రూష చేసినా అతని కడుపులో ఉన్న విద్యలో పదోవంతు నేర్చుకోలేడు.

"ఏం చూసయ్యా వీడతణ్ణి తృణీకరించడం?"

పంతులుగారు చాలా సాఫీ అయిన స్వరంతోనే ముగించారు. అయితే మాట స్వరం ఎంత మృదువుగా ఉండెనో ధోరణి అంత పదునుగా ఉండెను.

కుమార్తెలూ, కొడుకూ, భార్యా, అల్లుడూ ఎక్కడి వాళ్ళక్కడ అలా నిల్చుని వింటున్నారు. పిల్లలు కూడా తమకు ఏమీ తెలియకపోయినా నలుగురి ముఖాల్లోకి చూస్తూ అక్కడే ఉన్నారు.

ఉమ మాత్రం మధ్యలో కండ్లు తిరిగాయేమో చతికిలపడిపోయి తల వేల వేసింది. దూరంగా ఉన్న జానకి పరిస్థితి గమనించి చన్నీరు తెచ్చి యిచ్చింది. ఉమ అవి త్రాగి తేరుకుంది. జానకి విసనకర్ర తెచ్చి విసర బోయింది కాని ఉమ వారించింది.

పంతులు గారిదేమీ గమనించలేదు. కొంతసేపు ఊరుకొని ఆరంభించారు.

"యింక ఆ పిల్ల మీ తమ్ముణ్ణంటే కోపం రాదా అన్నావు. ఏల రావాలి? ఆమె ఆరోపణలలో ఏది కాదనగలవో చెప్పుదూ?" అని కాస్త సేపాగి "దోషా దోషి విచారణ సాగించేటప్పుడు తల్లయేది, పిల్లయేది, భార్యయేది, చెల్లలయేది ఒక్కలాగే చూడాలి. అలా చూసే దమ్ము లేకపోతే చూస్తూ ఊరుకోవాలి. అంతే గానీ..." అంటూ వాక్యం పూర్తి చేయకుండానే ఆగిపోయారు.

కొంతసేపటికి ఎవరిమట్టుక వారు లోనికి వెళ్ళిపోయారు.

ఆ దినం సంవత్సరాదన్న మాటేగాని అట్టి దుర్దినాన్ని ఆ కుటుంబం ఎన్నడూ చూసి ఉండదు.

ఆ రాత్రి పడక గదిలో బుచ్చిబాబూ భార్యా మధ్యాహ్నపు గొడవను గూర్చి చర్చించుకొంటూంటే భార్య అంది –

"మీరు లక్ష చెప్పండి, నాన్నగారట్లా మాట్లాడ్డం తగదు. చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా ఆమె నోటికి వచ్చినట్టూ అత్తగారు అనైనా ఆలోచించకుండా దానిని కూడా అంతంతేసి మాటలంటే – ఈయన ఊరుకున్నదిపోయి పైగా వాడు మందలించబోతే మళ్ళా ఆవిణ్ణి వెనుక వేసుక రావడం కూడానా?

ఆవిడవల్ల తప్పుందనే కడదాం, అయితే కోడలై వుండి అలా వాగుతుందా?

"ఆవిడెంత యేడ్చిందనీ?"

భార్య మామా కోడళ్ళ తప్పును యింకా అనేకవిధాల ఎత్తి చూపింది. బుచ్చిబాబు ముఖస్తంగా చివరకు అంగీకరించినా కాస్త కూడా ఏకీభవించ లేదు. ఆలోచించిన కొద్దీ అతనికి ముసలాయన దూరదృష్టి విస్పష్టమై అతని యందుండే గౌరవం హెచ్చింది.

6

మర్నాటి ఉదయంకల్లా అంతా కాస్త కలకదేరారు – ముగ్గురు తప్ప. వారు ముగ్గురూ రాత్రల్లా నిద్రపోలేదు. నిద్రించి వుంటే వారూ తక్కిన వారిలా జరిగిన దానిలో చాలామట్టుకు మరిచిపోయి ఉండేవారు.

శేఖరం స్నానం చేసి బట్టలు వేసుకుంటూ ఉంటే ఉమ నిశ్శబ్దంగా వచ్చి ద్వారం వద్ద నిలుచుంది. శేఖరం చూసి కూడా చూడనట్టు ఊరుకున్నాడు. ఉమ కొంతసేపు భర్తవంక చూసి నిశ్చిత స్వరంతో అంది.

"అలా వెళ్ళినప్పుడు అన్నయ్యకు ఒక టెలిగ్రాం యివ్వండి – సాయం కాలంలోగా ఎలానేనా రమ్మనండి."

శేఖరం యీసారి మాత్రం భార్య వంక ఒకసారి చూసి మళ్ళా తల దువ్వుకోవడంలో నిమగ్నుడయ్యాడు.

ఉమ కొంతసేపు వేచి వుండి తర్వాత ఎలా వచ్చిందో అలానే వెళ్ళి పోయింది.

సాయంకాలం ఆరు గంటలకు హరిప్రసాదరావు చేతిలో రైలుసంచితో హాజరయ్యాడు. సరస్వతీ, అన్నా – మామయ్య వచ్చాడంటూ పోయి కౌగలించుకున్నారు. అలవాటు చొప్పున చేతిలోని రైలుసంచీ వంక చూశారు. కాని మామయ్య 'క్షమాపణ'తో అందులో ఏమీ లేదని చెప్పి అనుకోని ఆశాభంగం కలిగించాడు.

రాత్రి భోజనాల వద్ద హరిప్రసాదరావు తను వచ్చిన కార్యం బయట పెట్టాడు.

భార్యకు పురిటి రోజులు సమీపించాయట. చేసుకోలేకుండా ఉంది. తల్లి – ఉమ అక్కకు ఒంట్లో బాగులేకపోతే వెళ్లిందట. వచ్చేసరికి ఎంత కాలం పదుతుందో తెలియదు. ఇంట్లో ఇంకొక మనిషి తోడులేకపోతే అది అనేకవిధాల బాధాకరంగా ఉందట.

ఇంక–

ఉమని పండుగ ముందే పంపమంటే ఆడపిల్లల్ని తీసుకు వస్తున్నామని వ్రాశారుట. తనకేమనటానికీ అవకాశం చిక్కింది కాదుట. కాని పరిస్థితుల ఒత్తిడికొద్దీ వచ్చిన పండుగ ఇంకా పొలిమేరయినా దాటకుండా తను రావలసి వచ్చిందట!

అబద్ధమాడేటప్పుడు నాలుగు వంకల నుండీ చూసుకొని కాస్త పెద్దదే ఆడితే ఒకప్పుడది కాయవచ్చు కాని అబద్ధం ఆడకుండా, నిజం చెప్పకుండా ఆడితే మాత్రం అది ఎదుటివాడు మరీ మూర్ఖుడైతే తప్ప బయటపడి తీరుతుంది.

అంతే జరిగింది. కాని ఆదినారాయణ మూర్తి పంతులు యిట్టి సందర్భాలలో మాత్రం తన నియోగం మరిచిపోడు. జాగ్రత్తగా ఇలా అన్నాడు.

"అయ్యో నాయనా కష్టసుఖాలందరికి ఒహటేనోయ్! ఇవాళ నీ పిల్లయింది – రేపు నా పిల్లవుతుంది" అంటూ కోడల్ని పిలిపించి అన్నారు.

"ఏవమ్మా అన్నయ్య తీసుకు వెళతానంటున్నాడు ఏమంటావ్?"

అధోముఖియై నిల్చుని ఉన్న ఉమ మౌనంగా ఊరుకుంది. హరిప్రసాద రావు అడ్డుపడి అన్నాడు.

"అదేమంటుంది – మామగారూ? పెద్దలు! మీరేమంటే అది కాదన గలదూ?"

పంతులుగారు అడ్డంగా తల ఊపుతూ అన్నారు.

"అలా కాదు నాయనా! నీకు తెలియదు. అది యీ యింటికి వచ్చింది లగాయితూ యీ యింట్లో యే కార్యమైనా దాని సలహా లేకుండా గాని, దాని ఇష్టానికి వ్యతిరేకంగా గాని జరిగిందేమో ఆ పిల్లనే అడుగు. లేక అది యీ పని ఇలా జరగాలీ అంటే విరుద్ధంగా ఏమైనా జరిగిందేమో అడుగు" అని క్షణకాలం ఆగి "అది ఒక్కొక్క ఇంటి అదృష్టం నాయనా! ఒక్కొక్క కోడలు వచ్చాక ఇల్లు నాలుగిళ్ళుగా చీలిపోతుంది. ఒక్కొక్క కోడలు వచ్చాక పట్టిందల్లా బంగారమై ఇల్లు ఏకసూత్రం మీద నడుస్తుంది.

ఈ యింటి ఆడదాని పూవురేకు ఫలమే అను – లేక మీ తల్లి కడుపు చలవే అను – ఏమైనా మాకీ బొట్టె కోడలుగా లభించింది.

ఇలా యింట్లో పాదం పెట్టింది. పెద్దవాడి కుద్యోగమయింది. ఆరు మాసాల్లో నాకు ప్రమోషను వచ్చింది. తరువాత తరువాత దాని చేతి మీదుగానే ఇద్దరాడపిల్లలకు సలక్షణమైన సంబంధాలతో పెళ్ళిళ్ళు చేసింది. మా యింట కష్టమే పడిందో సుఖం పొందిందో మమ్మల్ని మాత్రం సుఖపెడుతోంది".

అని ఎవ్వరూ మాటాడకపోగా–

"అంచేతే దాన్ని ఎక్కడికైనా పంపటమంటే ప్రలోభం చూపిస్తూ ఉంటాను. కానీ నాకెంత ఆశ ఉంటుందో కనుక్కున్న వాళ్ళు మీకూ అంతే ఆశ ఉంటుంది. అది నాకు తెల్సు. అయినా ప్రలోభం గొప్పది చూడూ?"

పంతులుగారు ప్రశ్నవేసి ఆగిపోయారు.

హరిప్రసాదరావు నిజానికి చదువుకున్న వాడూ, తెలివైన వాడూ అవును. ఏ గణితశాస్త్రపు సమస్యనో యిస్తే దాన్ని నిముషంలో పరిష్కరించడంలోనూ, ఏ రాచకీయ సాంఘిక విషయాలు గూర్చో చర్చించమంటే ఎదుటివాణ్ణి నోరెత్తనీయ కుండా వివిధ గ్రంథాల లోంచి ఉల్లేఖితాలిస్తూ ఉపన్యసించడం లోనూ ఘటికుడే. కాని లౌకికాల్లో మాత్రం అతడు శుద్ధ మూఢుడు. దూరదృష్టి యుతమూ, భావగర్భితమూ అయిన ఆ వృద్ధుని ఉపన్యాసానికీ అతడిచ్చిన జవాబు చూస్తే అదే ఋజువవు తుంది. అతడన్నాడు.

"ఎంతమాట. ఏదో ఇబ్బందిగా ఉంది – కాస్త సహాయంగా ఉంటుందని గాని మిమ్మల్ని యిబ్బంది పెట్టడం ఎన్నడూ నా ఉద్దేశం కాదు" అని కాసేపాగి "మీరూ... " అంటూ నసగసాగాడు.

పంతులు గారు గ్రహించి అన్నారు.

"అబ్బే దానికేముంది నాయనా! పరిస్థితి చెప్పాను". అని క్షణమాగి కోడలి నుద్దేశించి.

"సరేనమ్మా! అన్నయ్యకు అవసరమంటున్నాడు. నీకూ వెళ్ళాలనే ఉన్నట్టుంది. వెళ్ళిరా, కాని ఒక్క విషయం జ్ఞాపకం ఉంచుకో. మీ అత్త ముసలిది – వట్టి చాదస్తురాలు. యింక మీ ఆయన పరమ సోమరి. నా మాటయెల్లా ఉన్నా వీళ్ళిద్దరూ క్షణం వేగలేరు. అందుచేత వీలైనంత వేగిరం బయలుదేరి రా".

పంతులుగారు ముగించారు. క్షణకాలం అంతా నిశ్శబ్దం. తల్లి కొంగు పుచ్చుకుని నిల్చుని ఉన్న సరస్వతి అకస్మాత్తుగా ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ మాట్లాడింది.

"వెళ్ళమన్నారు కదే. ఇంకెందు కేలుత్తావ్" అంది దీర్ఘం తీస్తూ.

ఉమ చప్పున కూతుర్ని ప్రక్కకు నెట్టి అక్కడ నుండి వెళ్ళిపోయింది.

సరస్వతి చిన్న బోయిన ముఖంతో తాత వంకా మేనమామ వంకా చూసింది. వారు వినలేదో, వినినా విననట్టు నటిస్తున్నారో సరస్వతి చూపులను గుర్తించకుండా మౌనంగా భోజనాలు ముగిస్తున్నారు. భోజనాలయాక శేఖరం కూతుర్ని తోడ్కుక వీధి గదిలోకి వెళ్ళిపోయాడు.

7

రాత్రి పదకొండు గంటలవుతుంది. పంతులు గారింట్లో ఒక్కొక్కరే నిద్రా ముద్రితులౌతున్నారు. నిద్రపట్టని జానకి మెల్లిగా డాబా మీదకు వెళ్ళింది.

ఉమ ఒక చాప పరచుకొని ఒక్కర్తే పడుకొని ఉంది. జానకి వంగి ఆమె ముఖంలోకి చూస్తూ నెమ్మదిగా అడిగింది.

"నిద్రేనా వదినా?"

ఉమ కండ్లు విప్పి చూసి ఆ చీకట్లోనే జానకిని గుర్తించి అంది.

"లేదమ్మా! ఏం?"

"నేను కూడా నీ ప్రక్కన పడుకోనా?"

"రా అమ్మా పడుకో" అంటూ చోటు చేసింది. జానకి ఒదిన ప్రక్కన ఒరుగుతూంటే పదేండ్ల క్రితం యిలానే తను

అడగటం, చిన్న ఘర్షణ పిదప ఆమె తన ప్రక్కలో పడుకో పెట్టుకోవటం జ్ఞాపకం వచ్చింది.

అప్పుడు తనకు ఆరేళ్ళు. రాత్రులు వదినా, అన్నయ్యా డాబామీద పడుకుండే వారు. ఒకనాడు రాత్రి భోజనాలయిన పిదప సాయంత్రం అన్నయ్య తెచ్చిన మల్లెపూలదండ తుంపి చిన్నది తన తల్లోపెట్టి పెద్దది తాను తురుముకుంది. ఆవాళ వదిన చాలా నీటుగా ముస్తాబయింది. వెన్నెల రాత్రి కూడా. తనకు ఆవాళ ఆమె ప్రక్కలో పడుకోవాలని బుద్ధి పుట్టింది. డాబామీద వదిన ప్రక్కలు పరుస్తూ వుంటే తనూ వెనుకనే వెళ్ళి యివాళ నేను నీ ప్రక్కలో పడుకుంటాను వదినా అంది. వదిన కాస్తసేపాలోచించి సరే కానిమ్మంది. తను పడుకుంది. వదిన క్రిందికి వెళ్ళింది.

కొంతసేపటికి అన్న వచ్చి క్రిందికి పొమ్మన్నాడు. బితుకు బితుకు మంటూనే వదిన అనుజ్ఞ ఇచ్చిందని చెప్పింది. అన్న వల్లకాదు పొమ్మన్నాడు. ఇంతలో వదిన వచ్చింది. అన్నావదినా వాదులాడుకొన్నారు. అన్న కోపంగా మాట్లాడి ఊరుకున్నాడు.

తర్వాత కొంతసేపటికి తన్ను వెతుక్కుంటూ తల్లి అక్కడికి వచ్చి "ఇదేమే యిక్కడకు చేరావ్" అని కోప్పడింది. తన కోర్కెలో ఏదో తప్పుందని అంతకు ముందే కాస్త అర్థమయింది. తల్లి మందలింపుతో పూర్తిగా అర్థమైంది.

తను లేవబోతూ ఉంటే ఉమ రెక్క పట్టుకు మీదకు లాక్కుంటూ 'ఉండనివ్వండి అత్తయ్యా! పాపం సరదా పడుతోంది' అంటూ తల్లికి నచ్చచెప్పి పంపించేసింది.

మర్నాడు చిన్నక్కకు కథంతా చెప్పి "ఏమిటే తప్పు?" అని తను అడిగితే – 'కాదటే' అంటూ ఏదో విప్పి చెప్పింది. తనెంతో సిగ్గుపడింది.

ఆవాళ వదిన ఒక్కమాట అంది. తనకు బాగా జ్ఞాపకం. తల్లి తనను విడిచి క్రిందికి వెళ్ళిపోయాక అన్న యేదో గొణిగాడు గాబోలు. వదిన తనను పొదవి పట్టుకుంటూ అంది –

"ఎవళ్ళకు కోపం వచ్చినా మనమిద్దరం ఒకటమ్మ, ఏం?" అంది. జానకి ఆ పురాతన గాథకూ నేటి గాథకూ గల సంబంధ సామ్యాలు ఊహించుకుంటూ నల్లని ఆకాశంలో మెరసే చుక్కల్లోకి చూస్తోంది.

కొంతసేపటి వరకూ ఆ విశాల వినీలాకాశంలో మెరసే నక్షత్రాల అస్పష్టపు కాంతిలో వారిద్దరూ మూగగా గడిపారు.

ఉండి ఉండి జానకి మనస్సులో ఓ భావం కదిలింది. వదినకీ సమయాన ఆనాటి గాథ జ్ఞప్తికి వచ్చి ఉంటుందా? తను జ్ఞాపకం చేస్తే?

సరిగ్గా అదే సమయాన ఉమ ఒత్తిగిలి జానకిని పొదివి పట్టుకుంది. జానకి హృదయం ద్రవీభూతమయింది.

"వదినా?"

"ఏవమ్మా?"

వదిన గొంతులో కూడా ఏదో అస్వాభావికత కానవస్తోంది.

"నిజంగా వెళ్తున్నావా వదినా?"

వదిన మాటాడలేదు, ఆమె ఊపిరి కూడా పీలుస్తున్నట్టు లేదు. ఒకసారి గుటక వేసినట్టుంది.

"నువ్వు వెళ్తున్నావు. నా మీద కోపం వచ్చి కాదు కదూ?"

ఉమ చప్పున కౌగిలి బిగించింది. జానకి హృదయం కరిగి కళ్ళలోంచి ప్రవహింప సాగింది. శోకార్ద్ర స్వరంతో అడిగింది.

"ఇదంతా నానుండేగా వదినా, చెప్పు; నీకు నా మీద నిజంగా ఏమీ కోపం లేదా?"

వదిన కూడా అట్టి స్వరంతోనే జవాబిచ్చింది.

"లేదమ్మా కొంచెం కూడా లేదు".

జానకి స్పష్టాస్పష్టపు పలుకులతో వాపోవసాగింది–

"నాకు తెలుసు. ఉండదు. నువ్వట్టి దానివే. కాని పండుగపూటా నిన్న నువ్వు తగని హింస పొందావు వదినా! మొదటినుండీ నా కోసం చీవాట్లే తిన్నావు. చిన్ననాడూ యీనాడూ కూడా. నువ్వు మాత్రం యిది కడుపులో పెట్టుకోవు కదూ. నీ సరూ ఒకటి, నేను ఒకటీ కాదు కదూ ఒదినా?..."

తర్వాత ఆ బేల నోట మరి మాట ఊడిరాలేదు. బహుశా చెప్పడానికి కూడా ఏమి లేదేమో.

తర్వాత వాళ్ళిద్దరూ కళ్ళలో నీరంతా ఖర్చయే వరకూ అలా ఏడ్చారు. ఇరువురూ చివరకు అలసి ఊరట పొందారు. పిదప వదిన జానకి తలను తన గుండెలపై చేర్చుకొనగా చల్లని ముంగురులు సర్దుతుండగా ఎప్పుడు నిద్రపోయిందో నిద్రపోయింది.

తెల్లవారుజామున కాబోలు తల్లి తనను తట్టి లేపింది. లేచి కళ్ళు నులుముకుంటూ ఉంటే.

"అదేమే మంచులోనే పడుకుండిపోయారూ? రేపు ఏ ఊష్ణమో వస్తే ఎవరు చేస్తారు?" అని కాస్త ఆగి "ఆవిడని కూడా లేవు" అంటూ క్రిందకు దిగిపోయింది.

తన బట్టల్లానే ఒదిన బట్టలు కూడా మంచుకేనేమో తడిసి ఉన్నాయి. అప్పుడే పడుకుందేమో రెండు మూడుసార్లు తట్టితేగాని లేవలేదు. పిదప ఇద్దరూ క్రిందికి పోయి పడుకున్నారు.

మర్నాడు ఉదయం తను లేచేసరికి వదినా, పిల్లలూ అప్పుడే ప్రయాణమై వెళ్ళిపోయారు.

8

ఊరునుండి వచ్చిన మూడవ రోజున కాబోలు ఉమా, హరిప్రసాద రావూ నట్టింట కూర్చుని లోకాభిరామాయణం చర్చిస్తున్నారు. కొంతసేపు పోయాక హరిప్రసాదరావు స్వరం తగ్గించి అడిగాడు.

"అయితే జరిగిందేమిటమ్మా?"

అంతవరకూ స్వేచ్ఛగా మనఃకవాటం తెరిచి మాటాడుతున్న ఉమ చప్పున కవాటం మూసేసుకుంది. కొంతసేపు పోయాక కాస్త ఓరవాకిలిగా తెరిచి మాటాడసాగింది.

''ఏం జరిగింది. నువ్వు పిల్చావు, నేవచ్చాను''. హరిప్రసాదరావ్ కొంతసేపు ఊరుకుని అడిగాడు.

"అది కాదమ్మా! నువ్వు వైర్ చేయవలసిన అవసరం ఏం వచ్చిందీ?"

"కింద ఎవరి సంతకం ఉందీ?"

అన్న నవ్వుతూ అన్నాడు–

"మీ ఆయనదే అనుకో"

"అయితే ఆయననే అడగవలసింది నువ్వు"

"అడిగాను. అడిగితే ఆయన నువ్వు రప్పించమన్నావు, రప్పించా నన్నాడు".

"ఎందుకని నువ్వడగలేదా?"

"అదీ అడిగాను. 'ఏమో తెలియదు. బహుశః మీతో రాదలచు కుందేమో' అన్నాడు. నేనా ముఖవైఖరీ, వాగ్ధోరణీ గమనించి ఏదో కీచులాడుకున్నారనుకున్నాను. తరువాత అతడు నాతో బజారు వరకు వచ్చి తను పనిమీద వెళ్ళాలని చెపుతూ నన్ను యింటికి వెళ్ళమన్నాడు. నేను కొంతదూరం పోయాక పిలిచి, మళ్ళా ఏమీ లేదంటూ వెళ్ళి పోయాడు.

ఇంటికి వస్తే మామగారి ధోరణి ఇంకోలా ఉంది. నా రాకకు ఆశ్చర్య పోవడం చూసి వైర్ సంగతి ఆయనకు తెలియదనుకున్నాను.

తర్వాత అన్నిటికీ తగినట్టు ఏవో అబద్ధాలు ఆడవలసి వచ్చింది!

హరిప్రసాదరావు కొంతసేపు ఆగి తన ప్రశ్నను పునరుద్ధరించు కున్నాడు.

"ఇంతకూ ఇదంతా ఏమిటో తెలియకుండా ఉంది"

ఉమ మొఖం అదోలా పెట్టి, అంది.

"ఏముందీ నేను మా అత్తారితో పోట్లాడి వచ్చేశాను. తెలుస్తూనే ఉందిగా?"

హరిప్రసాదం అప్రతిభుడై ఊరుకున్నాడు. ఉమ వదినను పిల్చి ఆమె వచ్చాక తీక్షణంగా అడిగింది.

"ఏమమ్మా. నీ మంత్రాంగమా లేక ఆయనగారి స్వబుద్ధా? అక్కడ ఎలాగూ పోట్లాడి వచ్చింది. ఇక్కడి నుండి కూడా తరిమేదామని ప్రయత్నిస్తున్నారేమో! మీరేం చేసినా పోయేదాన్ని కాదు".

వదినగారు నిచ్చరపోతూ అడిగారు–

"ఇప్పుడేమయిందమ్మా?"

"మీ ఆయన నిన్న నీ ముందు చెప్పని రహస్యాన్ని ఇప్పుడు ఏకాంతంగా అడగటంలో ఉద్దేశమేమిటి? నీకూ నాకూ పోట్లాట పెట్టే నేర్పు కాకపోతే?"

వదిన తేలికపడ్డ హృదయంతో నవ్వుతూ–

"అదటమ్మా! నీ కాభయమేమీ వద్దులే, ఇద్దరి మధ్యా ఇదుముళ్ళు పెట్టే పాటి తెలివితేటలే ఉంటే ఆయన బి.ఎ. చదివాక బి.ఎల్.కే పోయి ఉందురు. ఇలా మేష్టరెందుకౌతారూ?"

"అయితే ఇది నీ తెలివితేటల ఫలమే అన్నమాట"

వదిన మాటల్లో ఉమకేమీ తీసిపోదు.

"సహవాస దోషబలిమిని అయినా అవవచ్చు. ఎంతైనా నీ అంత తెలివి నాచేత కాలేదు".

"నా ఇదుముళ్ళతనమేం చూశావ్"

"నువ్వు ఇప్పుడు చూస్తుండగానే మా ఇద్దరి నడుమ తగువుపెట్ట చూడలే?"

"నేనా?"

"అయ్యో, అడుగుతోందయ్యా నంగనాచిలా. ఆయన చెల్లెలు కదా అని నమ్మి నా ముఖం చాటేసి ఏదో అడుగుతూ ఉంటే, పనివేళ నన్ను పిలిచి చూడు నీ మొగుడెట్లా నీ ముందు రహస్యాలు దాస్తున్నాడో అనటంలో ఉద్దేశమేమిటో?"

ఉమ పకపకనవ్వి అంది.

"గడుసుదానివే! ఎట్లానైనా ఆలుమగలు ఒకటే".

వదిన మాట పూర్తి కాకుండానే అభినయం చేస్తూ అంది.

"ఆమాటే అంటే ఈ పిచ్చి బ్రాహ్మడికి అర్థమయింది కాదు. అయితే పోయి అడగండన్నాను. అడిగారు. నువ్వు మెత్తని చెప్పుతో యీ లెంపా ఆ లెంపా వాయించావు. ఇకనైనా బుద్ధివచ్చిందో లేదో కాస్త అడిగి చూడు".

ఉమ దాగని నవ్వు పెదవుల అంచులబడి జారుతుండగా మునిపళ్ళు కరచిపెట్టి తొందరగా పోయి వదిన బుగ్గలు నులుముతూ అంది–

"బుద్ధొచ్చిందా – బుద్ధొచ్చిందా?"

వదిన నవ్వుతూ తప్పించుకొని అంది.

"నాకు కాదు మీ అన్నకు".

ఉమ వదిన బుగ్గలు వదిలి ఆమె ముఖంలోకి చురచుర చూస్తూ అంది.

"ఏమో మేమింకా అంతపాటి 'రాగ'లం కాలేదు. నీకుందేమో అట్టి సామర్థ్యత!" వదిన నవ్వుతూనే అంది.

"అబ్బే. నువ్వు రాగవని ఎవరనగలరూ? బేలవు కనుకే అంత పెద్ద పోట్లాట పోట్లాడి కూడా మా అన్నద్వారానే నీ అవసరం నెరవేర్చు కున్నావు".

ఉమ వదినను పట్టుకోబోయింది, కాని ఆమె తొందరగా అవతలకు వెళ్ళి పోయింది.

9

నెల్లాళ్ళనాడు ఒక సాయంకాలం వదిన వంట యింట్లో వండుతోంది. పిల్లంతా వీధి వాకిట్లో గొడవగా ఆడుకొంటున్నారు.

హరిప్రసాదరావు ఇంకా ఇంటికి రాలేదు. వారం రోజుల క్రిందట ఊరినుండి వచ్చిన తల్లి కూడా ప్రక్క వీధిలో ఉన్న చుట్టాల యింటికి వెళ్ళి యింకా రాలేదు.

ఉమ చేతిలో ఉత్తరంతో ప్రవేశిస్తూ అరవసాగింది.

"ఏమమ్మో రేపటితో మీ పీడ వదులుతుంది"

వదిన పరధ్యానంగా ఉండి వినిపించుకోక 'ఏమిటీ?' అంది ఇటు తిరిగి.

"రేపు నా ప్రయాణం".

వదినకు తన మరదలి సంగతి బాగా తెల్సు. అందుచేత పులుకూ పులుకూ మని చూసి అంది.

"కృతఘ్నురాలా, ఇన్నాళ్ళూ మా యింట్లో పడి మేసి – ఇప్పుడింక ఇవాళో రేపో పురుడు వస్తుంది కదా; చాకిరీ చెయ్యాలి అని పారిపోతావా?"

ఉమ కాస్త ఆలస్యంగా జవాబిచ్చింది.

"నువ్వు ఏ ఉద్దేశంతో వాడేవోగాని వదినా మా మంచి పేరు పెట్టావ్ – నాకా పేరు సరిగ్గా సరిపోతుంది."

"ఏం?"

"తొమ్మిదవ నెల వెళ్ళినా నిన్ను పొయ్యి దగ్గర నుండి లేవనెత్త గలిగానా?"

"నువ్వు మాట మారుస్తున్నావు."

"లేదు"

"అయితే నీ యింట్లో నీ ఆడపడుచులచేత అట్లానే చేయించుకుంటున్నావా?"

"నేనా? నేను అత్తగారినే నోటికి వచ్చినట్టు వదిరే భ్రష్టురాలను!"

ఉమ స్వరం మారిపోయింది. వదిన గమనించి కొంతసేపటి వరకూ ఏమీ మాటాడలేక పోయింది. తర్వాత మెల్లిగా అంది–

"నేను నీకన్నా మూడేళ్ళు ముందుగా కాపురం ఆరంభించాను. కాని నీలా ఎప్పుడూ అత్తగారిని మందలించలేదు. మా అత్తగారూ నాకట్టి పరిస్థితి కల్పించలేదు. ఒకవేళ కల్పించి ఉంటే నీలా మందలించగలిగే దానినా లేదా అని ఇప్పుడు ఆలోచిస్తున్నాను.

నిజానికి మందలించ గలిగితేనే నేను సంతోషిస్తాను.

ఎవరమ్మా అత్తనూ, భర్తనూ, మరదుల్నీ గదమాయించ గలిగిన భాగ్యశాలినులు – ఎంతమంది ఉంటారు.

నువ్వు ఎవర్ని గదమాయించగలవ్? అహర్నిశలూ కండ్లు వేయి కండ్లుగా చేసుకొని, నానా చాకిరీ చేసి ప్రాణంగా పెంచుకునే నీ బిడ్డల్ని, నీ ప్రాణంకన్నా ప్రాణంగా ప్రేమించే నీ బిడ్డల్ని గదమాయించగలవ్. ఇతరు లను కూడా గదమాయించ గలిగావంటే వాళ్ళను కూడా నీ బిడ్డలను చూసినట్టు చూచుకుంటున్నావన్న మాట. లేనప్పుడు నీకా స్వతంత్రం ఎక్కణ్నుంచి వస్తుందీ?"

వదిన అలా ప్రశ్నవేసి పొగలు చిమ్ముతున్న పొయి వంక తిరిగింది. విసనకర్ర తీసి విసరగా కొంత సేపటివరకూ పొగలు చెదిరి మరీ యిబ్బంది కలిగించాయి. చివరకు చక్కగా మండసాగింది.

ఉమ అడిగింది–

"అయితే వదినా లోకంలో అత్తమామల మీదా మొగుడు మీదా విరుచుకుపడే కోడళ్ళందరూ అట్టి అభిమానం కలవారే అవుతారా?"

"ఎలా అవుతారూ?" వదిన తను చేస్తున్న పనినుండి దృష్టి మరల్చకుండానే చెప్పసాగింది. "నీ బిడ్డలను తప్పుపని నుండి మందలిస్తు న్నప్పుడు నువ్వు చేస్తున్న పనినిగూర్చి నీ అంతఃకరణలో ఎలా ఎట్టి జంకూ ఉండదో అట్లానే నీ అత్తమామల్ని గాని మొగుడును గాని మందలించే టప్పుడు కూడా నీ అంతఃకరణలో లోకభీతికాని ధర్మభీతి కాని లేక మరెట్టి భీతికాని ఉండరాదు. అది అంతఃకరణ శుద్ధమైన ప్రేమ ఉంటేనే కాని సాధ్యంకాదు".

వదిన చెప్పేది పూర్తి కాకుండానే ఉమ అంది–

"అవును. అవును వదినా! నేనూ అలానే అనుకున్నాను. కాబట్టే నేను భ్రష్టురాలనని చెప్పుకుంటున్నాను".

ఈసారి వదిన మరదలి ముఖంలోకి చూసి అంది.

"ఏమో నేనలా అనుకోను".

"నువ్వనుకోవని నాకు తెల్సు. లోకమంతా నీవంటి వారే అనుకుంటావు".

"నేనంత మూఢురాలనా?"

"కాకపోతే గ్రుడ్డిదానివి! అంతేనా?"

వదిన ఊరుకుంది.

కొంతసేపు వరకూ ఎవరూ మాటాడలేదు.

తర్వాత ఉమ ఉత్తరం మాట జ్ఞాపకం రాగా అంది.

"ఉత్తరం వచ్చింది"

"నువ్వు ప్రయాణమన్నప్పుడే నే ననుకున్నాను" - అంటూనే వదిన నవ్వింది.

"నువ్వనుకుంటావు! అనుకోవూ? అయితే మీ అన్నయ్య వ్రాశారని కూడా అనుకున్నావా."

వదిన ఎదురు ప్రశ్నతో జవాబిచ్చింది-

"ఎంత నువ్వు కొంగున కట్టుకున్నా మాకు పౌరుషం కొదువయిం దంటావా?"

"ఉన్న మాటన్నావు - ఈసారి కూడా ఆడపిల్లే పుట్టి-"

"స్వార్థంతో చేసిన ఆశీర్వచనం ఫలించదు గానీ - ఏం వ్రాశారు?"

"అయితే యెవరు వ్రాశారంటావు?"

"నాకేం కేరళం తెలుసనుకున్నావా?"!

"చెప్పుదూ!"

"మీ జానికమ్మేమో!"

"నీకెట్లా తెలిసిందీ?"

"ఎలానో తెల్సిందిలే ఏం వ్రాశారూ?"

"నేను వచ్చి నెల్లాళ్ళయినా ఉత్తరం వ్రాయలేదట. అన్నయ్య అయినా క్షేమంగా చేరినట్టే వ్రాసిన ఉత్తరం తప్పితే మళ్ళా వ్రాయలేదట. అమ్మ వచ్చిందా అనీ, వస్తే వెంటనే బయలుదేరి రమ్మనీ తన తప్పులన్నీ క్షమించమనీ వ్రాసింది. మధ్యను ఒక వాక్యం వ్రాసి క్రింద గీత గీసింది. ఏమిటో అది చెప్పుకో".

"అన్నయ్యకు చాలా కోపంగా ఉంది. అనా"

"కాదు గాని అదే అర్థం. ఒంట్లో బాగాలేదట".

"అమ్మో జానకి ఇంకా చిన్నపిల్ల అనే అనుకుంటున్నాను, ఇంత ప్రౌఢత్వం ఎక్కడ నేర్చిందీ?"

ఉమ దీర్ఘాలు తీస్తూ జవాబిచ్చింది.

"మీ అక్కాచెల్లెళ్ళకు వెన్నతో బెట్టినదమ్మా!" అంటూనే ఉంది. వదిన జవాబిచ్చేలోగా యింటికి వచ్చిన హరిప్రసాదం చెల్లెల్ని పిలిచాడు.

అతడు తెచ్చిన సామానులందుకొని భద్రంచేసి వచ్చి ఉమ తన ప్రయాణం సంగతి బయటపెట్టింది.

"అదేమిటమ్మా!" అంటూ అతడు భార్య దగ్గరకు బయలుదేరాడు. సరిగ్గా అదే సమయంలో తల్లి కూడా చుట్టాల యింటి నుండి వచ్చింది. వదిన - తగాయిదాను అత్తగారి ముందు పెట్టింది. ఉమ ఆటంకం చెపుతూ అంది-

"మీరంతా ఒకటే. మీ తీర్పుకు నేను కట్టుబడనవసరం లేదు. నా వాదమిది. మీరు నన్ను తీసుకరాలేదు. నా అంతట నేను వచ్చాను. నా అంతట నేను వెళ్తాను. మీరు తీసుక వచ్చినప్పుడు మీ యిష్టానుసారం పంపుదురు గాని."

చివరికి తల్లి విసిగి అంది.

"అయితే వాళ్ళు ఉత్తరం ముక్కైనా వ్రాయందే వెళ్తావుటే"

ఉమ పొరపాటును గుర్తిస్తూ అంది-

"ఇప్పుడు అక్కడకు ఎవరు వెళ్తారూ?"

తల్లి ఆశ్చర్యపోతూ అంది-

"అది ఒకటా? అయితే మరెక్కడకు?"

"పిన్ని గారింటికి?"

క్షణకాలం ఎవ్వరూ మాటాడలేదు. తరువాత వదిన అంది-

"అక్కడకు అయితే వెళ్ళి నాల్రోజులుండి మళ్ళా వచ్చేయండీ!"

ఉమ పేచీ విడవకుండా అంది-

"ఏమో నాల్రోజులే అవుతుందో నలభై రోజులే అవుతుందో నా పని అవందే తిరిగి రాను".

తల్లికి కోపం వచ్చి అంది-

"ఏమిటే నీ పనీ? నాకేం తెలియకుండా ఉందీ! ఏమిటో చెప్పుమీ?"

ఉమ కూడా తల్లిని వెక్కిరిస్తున్నట్టుంది-

"ఏమిటైతే నీకెందుకే నా సంసారం ఊసూ"

అన్నా వదినా నవ్వారు. కండ్లనిండా కోపం వచ్చినప్పుడు తన స్వభావాన్ననుసరించి తల్లి అక్కడ నుండి వెళ్ళిపోతుంటుంది. నేడు కూడా అలానే వెళ్ళిపోయింది. కానీ ఆమె కోపం తాటాకుల మంటకన్నా శీఘ్రంగా శమిస్తుందని అందరికీ తెల్సు. ఆమె వెళ్ళాక వదిన అడిగింది.

"అయితే బాలసారెకైనా రావటమ్మా!"

ఉమ కొంచెంసేపు ఊరుకుని అంది-

"నువ్వు నాకేమైనా ఆశ చూపినప్పుడు చూద్దాలే" అంటూనే ఆమె లేచి "ఇంతకూ నే నొక్కర్తను తక్కువైతే వచ్చిన

నష్టమేముందీ?" అని ప్రశ్నించింది. ఆలుమగలిద్దరూ జవాబు కోసరం తడుములాడారు. ఉమ కొంతసేపు ఆగి అంది. "ఇప్పుడు పరిస్థితులెలా ఉన్నాయో మీకు తెలియంది కాదు". ఇలా అంటూనే ఆమె లోనికి వెళ్ళిపోయింది.

ఉమ గొంతుక తడవకూ ఆర్ద్రమౌతూ రావటం గుర్తించిన అన్న సంజ చీకటులలో నిశ్చలంగా నిలిచి ఉన్న చెట్లలోకి దృష్టిని బోనిచ్చి ఏదో ఆలోచించసాగాడు.

10

ఉమనూ పిల్లలనూ తీసుకొని హరిప్రసాదరావే బయలుదేరాడు. రైలు దిగగానే ఓ రెండెడ్ల బండీ లభించింది.

ఇంటికి వచ్చేసరికి రాజశేఖరం, వీర్రాజు పంతులుగారూ ఇద్దరూ లేరు. రాజశేఖరం ఎవరో పట్నంలో చదువుకుంటున్న స్నేహితుని వద్దకు ముందురోజునే వెళ్ళాడట. ఎప్పుడు వస్తాడో తెలియదు. వీర్రాజు గారు ఏదో వ్యవహారం పురస్కరించుకొని పొరుగూరు వెళ్ళారు. సాయంకాలంకు వచ్చేస్తారట.

హరిప్రసాదం శెలవులేదని చెప్పి వచ్చిన బండిలోనే స్టేషనుకు బయలుదేరాలన్నాడు. పినతల్లి సుందరమ్మ చాలా బలవంతంచేసి చివరకు నిష్టురంగా మాట్లాడసాగింది. హరిప్రసాదం అన్నిటినీ భరించి 'నీమాట కెన్నడైనా ఎదురు చెప్పానా పిన్నీ? ఈసారి గత్యంతరం లేదు. ఏం చెయ్యమన్నావ్?" అంటూ పరిస్థితులు వివరించాడు.

చివరకు పినతల్లి నిజం బయటపెట్టింది.

"మీ చిన్నాన్న లేరు. ఆయన సంగతి మీకు తెలుసు. నాకెలానూ చీవాట్లున్నాయి. పోతే మీ వంతుకు వచ్చిన వాటిని మీరు తీసుకోవడానికి సిద్ధపడితే వెళ్లిరావచ్చు" అంది.

కాని ఈ జడిపింపు కూడా అతణ్ని ఆపలేకపోయింది. చివరకు హరిప్రసాదరావు వెళ్ళాడు.

సాయంకాలం ఐదు గంటలవుతుంది.

ఉమ పినతల్లి కూతురు సుమిత్రకు జడవేస్తోంది. సుమిత్ర పైట పరికిణీ కోసం లేసల్లుకుంటోంది. సుందరమ్మగారు వీధిలో ఉన్న పశువుల శాల నుండి వస్తూ 'మీ చిన్నాన్న గారు వస్తున్నారులే!' అంది ఉమ నుద్దేశించి. ఉమ చిరునవ్వుతో పినతల్లి వంక చూసింది. సుందరమ్మ గారు తన పనిలో వెళ్ళిపోయారు.

వీర్రాజు గారు జోళ్ళు చప్పుడు చేసుకుంటూ మెట్లెక్కి ద్వారం బయట నుండే చేతిలోని గొడుగు గోడనున్న మేకుకు తగిలించి జోళ్ళు స్తంభం మీద పెడుతూ పెద్ద గొంతుకతో ధాష్టికం చేస్తున్నట్టున్నారు.

"ఇదిగో ఏ మేవ్ కాళ్ళు కడుక్కోవటానికి నీళ్ళు పట్రా?"

ఉమ పెద్ద ఇత్తడి చెంబుతో నీళ్ళు తీసుకువెళ్ళి పరధ్యానంగా ఉన్న పినతండ్రి కందివ్వబోయింది. అతను చెంబు అందుకుంటూ చెయ్యి వంక చూసి చప్పున తలెత్తి ఉమ ముఖంలోకి చూశారు. క్షణకాలం ఆ తెరచిన నోరూ, ఆ బొమముడీ అలానే ఉండిపోయాయి.

ఉమ నవ్వుతూ అంది-

"ఏమిటి చిన్నాన్నా అలా చూస్తారూ. నేనే"

చిన్నాన్న తన సహజ ఉచ్ఛస్వరంలో సకృత్తుగా చెదరే గంభీర ముద్రతో అన్నారు.

"అవును నువ్వేలే...... ఎక్కణ్ణుండని!"

ఉమ చిరునవ్వు మరికొంత వికసింపగా అంది.

"నీళ్ళు తీసికోండి చెప్తాను!"

కాని పంతులుగారు చెంబు అందుకోకుండానే అడిగారు. ఆయన ముఖంలోనే కాకుండా గొంతుకలో కూడా ప్రమాదశంకా చిహ్నాలు స్పష్టంగా అగపడుతున్నాయి. ఆతృతగా అడిగారు.

"కోడల్ని తీసుకునేనా?"

"మీరు కాళ్ళు చేతులూ కడుక్కుని రండి చెపుతాను" అంటూనే చెంబు క్రిందపెట్టి ఉమ తువ్వాలు కోసం లోనికి వెళ్ళింది.

పంతులుగారు ఏమర్థం చేసుకున్నారో కాళ్ళు కడుక్కుంటూ ఆరంభించారు.

సుందరమ్మగారు నూతివద్ద వున్నా వినగలిగే అంత పెద్ద గొంతు పెడుతూ తిట్టనారంభించారు.

"అంతే నేననుకున్నంత పనీ అయింది. లేకపోతే యీ ద్రాపి ముఖాలకు పెత్తనమివ్వమని ఎవడు చెప్పాడు? వెధవలు వెధవలా అని! నేను వందసార్లు చెప్పాను. వింటేనా? మంచీ మర్యాదా లేని మనుషులు!" అంటూనే లోనికి వచ్చి అప్పుడే వచ్చిన భార్యను చూసి గొంతు రెట్టిస్తూ అభినయంతో సహా ఆరంభించారు.

"చూశావా? చూశావా ఏం జరిగిందో? నే చెపితే విన్నా! నీకు తగినట్టు బుద్ధి చెప్పారు. కాదు! కుక్కకాటుకు చెప్పుదెబ్బ అన్నట్టు చెప్పారు".

అంటూనే ఆయన అక్కడ వున్న మడత కుర్చీలో చతికిలపడి మేను వాల్చారు. ఇంతలో తువ్వాలు దొరకక తిరిగివచ్చిన ఉమ కూడా అక్కడకు వచ్చింది. ఏమయిందో బోధపడక సుందరమ్మ గారు కూతురు ముఖంలోకీ, భర్త ముఖంలోకీ చూస్తూ చివరికడిగారు.

"ఇప్పుడేం జరిగింది?"

వీర్రాజుగారు చప్పున కూర్చుంటూ వెక్కిరిస్తున్నట్టన్నారు–

"ఏం జరిగిందీ? ఏం జరగాలో అదే జరిగింది. మంచీ మర్యాదా ఉన్న మనుషుల కింకేం గావాలి?"

సుందరమ్మ గారడిగారు.

"ఇదేం దారమ్మా! ఏ విషయం చెప్పకుండానే తిడతారేం."

ఈసారి ఉమ ధైర్యంచేసి అడ్డుపడింది.

"జానకిని తీసుకురాలేదు. చిన్నాన్న గారూ?" అంది నెమ్మదిగా, ఆయన చప్పున వెనుదిరిగి ఆశ్చర్యపోతూ అడిగారు.

"ఏమిటి? కోడలు రాలేదూ? ఇప్పుడు వచ్చిందని చెప్పేవే"

సుందరమ్మ జవాబిచ్చింది.

''మీకెప్పుడూ అదే తలంపాయె. ఏమి విని ఏమనుకున్నారో"

"ఊరుకుందూహ్! వెధవ మాటలూ నువ్వూనూ" అని భార్యను కసురుకొని ఉమ వంక తిరిగి అడిగారు.

"అయితే నువ్వెక్కడ నుండి వస్తున్నావు?"

"ఈమధ్య నెల్లాళ్ళయి అన్నయ్య దగ్గర ఉంటున్నాను. ఇలా ఒకసారి చూసి పోదామని వచ్చాను". పంతులుగారు కాస్తసేపు ఊరుకొని అన్నారు.

"ఊ. అయితే ఒక్కర్తివే?"

"అన్నయ్య కూడా వచ్చాడు."

"ఏడీ వాడూ?"

ఉమ నవ్వుతూ పిన్ని వంక చూసింది. పిన్ని కూడా నవ్వుతూ "చెప్పే! ఇందాకటి మాటలేమయ్యాయ్?" అని ఆమె మాటాడకపోగా తనే చెప్పింది.

వీర్రాజు పంతులుగారు మళ్ళా రుద్రావతారం తాలుస్తూ ఆరంభించారు.

''వెళ్ళిపోయాడూ! శలవులేదూ? మరి నువ్వేం చేస్తున్నావ్?"

సుందరమ్మగారు నవ్వుతూ అన్నారు–

"అయితే వాణ్ణి పట్టుక కూర్చోమన్నారేమిటి?" మాట పూర్తి కాకుండానే.

"నోర్ముయ్! వెధవ నవ్వు నవ్వావు! వెధవ ముఖమా అని! మంచీ మర్యాదా తెలియని మనుషులు!! ఎట్లా వెళ్తావంటే ఎటు వెళ్తాడు? వాడి సంగతి నాకు తెలియదూ?"

"అయ్యో వాడికి శెలవు లేందే"

మళ్ళా భార్యను వెక్కిరిస్తూ "శలవు లేకపోవటమేమిటే శలవూ! మేష్టరుకు శెలవు లేకపోవడమేమిటి!"

సుందరమ్మగారికి కోపం వచ్చింది.

"అయితే నేనే పంపేశాను; సరా!" అంటూనే విసురుగా లోనికి వెళ్ళి పోయింది. వీర్రాజుగారు ఆమె వెళ్ళిన వంకే చూసి చూసి చివరకు ఉమవైపు తిరిగి 'ఇంతే' అంటూ పెదవి విరిచి కుర్చీలో చేరబడ్డాడు. ఉమ మాటాడలేదు. క్షణం ఊరుకుని పంతులుగారు మళ్ళా సరిగా కూర్చుంటూ ఆరంభించారు.

"మీ అన్న చూశావా ఏం చేశాడో! వాళ్ళు సలక్షణంగా వచ్చి పిల్లను తీసుకువెళ్ళారు. అల్లుణ్ణి పిలిచారు. మళ్ళా పండుగ ముందర వాళ్ళ మామగారు ఉత్తరం వ్రాశారు. ఇన్నీ చేస్తే ఈ పంతులుగారికి మెదడులో మరేం పురుగు పుట్టిందో వెళ్ళను పొమ్మన్నాడు–" గొంతుక తగ్గిస్తూ "వాళ్ళమ్మ చెప్పింది, నేను చెప్పాను– చిలకకు బోధపరిచినట్టు బోధపరిచాను! పెద్దవాళ్ళచేత చెప్పించాను! వెళ్ళకపోవడం – పైగా నాతో వచ్చి వాళ్ళతో వీళ్ళతో ఎందుకు చెప్తారూ?" అంటాడు.

"నువ్వు చెప్పు –" అని స్వరం హెచ్చిస్తూ "తప్పు పని చేస్తే పెద్దవాళ్ళ చేత గడ్డి పెట్టించక ఊరుకుంటారా? ఇవ్వాళ నేను వూరుకుంటే వాళ్ళ మామగారు వూరుకుంటారా?... చెప్పుట్టుకు కొట్టించరూ?" క్షణమాగి.

"అయినా కాకపోయినా మరొక పండుగ కాదాయెను. అందులో తొలి పండుగాయెను. వాళ్ళ మనసెంత క్షోభిస్తుందీ? తక్కిన వాళ్ళమాట ఎలా వున్నా ఆ పిల్ల మనస్సెలా క్షోభిస్తుందీ!" అని మళ్ళా స్వరం ఉదాత్తంకు మారుతుండగా "యిన్నీ చెపితే – ఆ ఏమీ ఫరవాలేదంటాడు"

పోనీ నాకు తెలియకుండా మీరూ మీరూ ఏమైనా మాటా మాటా అనుకున్నారా అంటే అదీ లేదంటాడు. వాడబద్ధమాడుతున్నాడేమోనని దానినడిగితే అదీ నాకు తెలియదంటుంది. పిల్లలనడిగితే పిల్లలూ తెలియదంటారు. 'మరేమీ లేనప్పుడు ఈ గొడవంతా ఏమిట్రా' అంటే బెల్లం కొట్టిన రాయిలా మాటాడడు!"

వీర్రాజు గారు. సుందరమ్మగారు ఎప్పుడు వచ్చి ఉన్నారో కొంతసేపు మౌనంగా ఊరుకొని పిదప అన్నారు. ఆమె ముఖంలో కోప చిహ్నాలు కాన వస్తున్నాయి.

"అయితే అవన్నీ దానికి తెలియవనే చెపుతున్నారేమిటి?"

కాని వీర్రాజుగారు లొంగి రాకుండా అంతకన్నా కోప్పడుతూ అన్నారు.

''తెలుస్తే చెప్పకూడదేమిటీ! కాదు! నాకు తెలియకడుగుతాను; తెలిస్తే చెప్పకూడదూ?" అని క్షణమాగి "అంత పౌరుషం ఏడిసిన మొగాలు బుద్ధిగా మసలుకోవాలి. ఇవాళ నా నోరు మూస్తావు, రేపు తక్కిన వాళ్ళ నోరెలా

మూస్తావ్?"

సుందరమ్మగారు ఈ దెబ్బతో మాటాడకుండా అక్కణ్ణుంచి నిష్క్రమించారు.

11

మరునాడుదయం ఉమ ఏకాంతంలో సుమిత్రను ప్రశ్నించింది. ఆ కిశోరి ఏమీ చిన్నపిల్ల కాదు. తన వయోనుగుణ్యంగా కొన్ని విషయాలు తెలిసినా తెలియనట్టు నటించేది. మోసం చేసే ఉద్దేశంతో కాదు. అట్టి విషయాలు తనకర్థం అవటం సిగ్గుచేటనే భయంచేత.

ఉమ ఎన్నో ప్రశ్నలు వేసి ఆమె నుండి తెలుసుకోగలిగిందల్లా భార్యా భర్తలు ఒకే గదిలో పడుకుంటున్నారనీ – ఒకసారి తల్లి కోడలితో ఏమో రహస్యంగా మాటాడిందనీ–

ఉమ అడిగింది. "వాళ్ళేమి మాటాడుకుని ఉంటారే?"

సుమిత్ర వెంటనే జవాబివ్వలేదు. తర్వాత అంది.

"అదేమో అమ్మ పొమ్మనగానే నేనవతలికి వెళ్ళిపోయాను".

పదమూడేళ్ళ ఆడపిల్ల 'రహస్యం మాటాడుకుంటున్నాం పొమ్మని' అంటే బుద్ధిగా బయటకు వెళ్ళిపోయిందంటే నమ్మరాని విషయం. కనీసం ఉమ నమ్మదు. అందుచేత ఇంకొకలా ప్రశ్నించింది.

"బహుశా 'వాళ్ళిద్దరూ పోట్లాడుకున్నారా!' అని అడిగి ఉంటుంది".

"అయి వుంటుంది."

సుమిత్ర ముఖం చూస్తే ఆ మాట నిజంలానే అగపడింది. తర్వాత కూడా సుమిత్ర అదే బలపరిచింది.

"అవును – ఒకనాడు అమ్మా నాన్నా కూడా ఆ విషయమై మాట్లాడుకున్నారు." అని చప్పున ఊరుకుంది.

ఉమ కూడా ఒక తప్పుటడుగు వేసింది.

"ఏవేళప్పుడు?"

ప్రశ్న వేశాక తన తప్పు గ్రహించుకుంది. సుమిత్ర కథ అల్లసాగింది.

"రాత్రి నేను నిద్రపోతున్నాను. చిన్న మాగన్నుగా వుంది. నాకు సరిగ్గా జ్ఞాపకం లేదు..."

చివరకు ఉమ విసిగి ఆమెను విడిచి పుచ్చింది.

మధ్యాహ్నం అందరి భోజనాలూ అయాక సుందరమ్మగారు భోజనం వద్ద కూర్చున్నారు. ఉమ వడ్డిస్తోంది.

వేసవి కాలం – మధ్యాహ్నం అయినా మసాబుగా ఉండడం చేత ఎండ బాధ అట్టే లేదు. సుందరమ్మగారు సోమరిగా భోంచేస్తున్నారు.

కొంతసేపు పోయాక ఉమ అడిగింది–

"పిన్నీ నేనొక మాట అడుగుతాను నీకు కోపం రాదు కదా?" అంది నెమ్మదిగా.

పరధ్యానంగా ఉన్న పిన్ని కూతురువంక తిరిగింది. ఆమె యింకా పూర్తిగా సావధానం కాలేదు. కాని స్వస్థతా దూరమైన ఉమ ఆరంభించే సింది.

"నువ్వూ ఆడపిల్లల్ని కనుక్కున్న దానివి. ఒకర్తెను కాపురానికి పంపించావు. ఇవాళో రేపో యింకొకతె వెళ్తుంది. ఇంకా వెళ్లవల్సిన వారున్నారు.

తల్లివై యుండీ ఇలా చెయ్యడం ధర్మమా చెప్పు?"

ఉమ ప్రశ్న వేసి ఆగిపోయింది. ఉమ మాటలూ, మాటలుకన్నా ధోరణి నిశితములై సుందరమ్మ గారికి తగిలి వచ్చాయి.

నిశ్చేష్టయై కళలు మార్చుకుంటున్న పిన్ని ముఖాన్ని చూడగానే ఉమ మళ్ళా ధైర్యచ్యుత కాసాగింది. అంది.

"నీ దగ్గర ఉండే చనువుకొద్దీ నేనిలా అడుగుతున్నాను. నువ్వు కోపం తెచ్చుకుంటే చెప్పలేను".

కాని ఈ వాక్యాలు పిన్నినే విధంగానూ స్వస్థురాలను చేయలేక పోయాయి.

ఆమె కోపాన్ని దిగమ్రింగుతున్నట్టు ఒక గుటక వేసి అన్నారు.

"కోపం కాదమ్మా నీకలా తోచి వుంటుంది. నువ్వని వుంటావు! దానికి కోపమెందుకూ? కాని నీ తప్పిది అని నిరూపించి అను!"

పిన్ని గొంతుక వినగానే ఉమ గొంతు మూసుకుపోయింది. పిన్ని వెనుకటంత వాడిగానూ ఆరంభించింది.

".... నేను నిజంగా చెపుతున్నాను. దేవుడి ముఖం చూసి నలుగురు కట్టిన యింటిక్రింద అన్నం తింటూ చెపుతున్నాను. ఇందులో నా తప్పేమీ లేదు. ఉంటే నువ్వు వేసిన వట్టు".

పిన్ని ఊరుకున్నారు.

అంతలో నిశ్శబ్దం; వాకిట్లో మెతుకులు తింటున్న రెండు కాకులు మాత్రం ఉండీ ఉడిగీ అరుస్తున్నాయి. ఉమ ముఖంలోని విహ్వలత చూసీ, కాఠిన్యానికి తానే సిగ్గుపడీ సుందరమ్మగారు స్వస్థులవటమేకాక కాస్తగా పశ్చాత్తాపం కూడా పడసాగారు. ఉమ మౌనంగా ఉండటం చూసి అనునయిస్తున్నట్టన్నారు.

"నాకు మీరు ఒకటీ కోడలు ఒకటీ కాదమ్మా! ఏ పదిమంది ఉన్నారనీ? నువ్వు దానినే అడిగి చూడూ. ఎప్పుడైనా

పక్షపాతం చూపానేమో... ఎంత చెడ్డా మీ అమ్మకు చెల్లెల్ని ఔదునుకదా!"

సుందరమ్మగారు ఆగిపోయారు. మరి కొంతసేపు పోయాక ఆమే అన్నారు.

"ఇంతకూ నీకు మాత్రం నా గుణం తెలియదు కనుకా?"

ఈసారి ఉమ మాటాడగలిగింది.

"నేను ఈశ్వర సాక్షిగా చెపుతున్నాను. పిన్నీ! ఇందుకు నువ్వు కారకురాలవని కాదు, నా ఉద్దేశం. కీలకమంతా అన్నయ్య చేతిలోనే ఉందని నాకు తెల్సు. అంతేకాదు, భగవంతుడు మేలుచేస్తే, అన్నయ్య ఇలా చేయటానికి కారణం కూడా తెలుసు. గాని నేననేది అన్నయ్యకు నువ్వెందుకు నచ్చచెప్పావు కాదని. ఒకవేళ చెప్పినా వినకపోతే నువ్వెందుకు స్వతంత్రించావు కావని? నువ్వు 'అలా కాదురా–' అని ఒక్క మాటంటే వాడు ఎదురు చెప్పగలడా?"

ఈసారి పిన్ని కలకదేరి మాటాడింది–

"ఆ మాట నిజమే మరి. కాని నా మాట కూడా నువ్వు విను. వాడి మనస్సుకు వ్యతిరేకమైన పని చేయడమంటే నా చేయాడదు. అది తప్పే అయి వుండవచ్చు కాని ఏం చెయ్యను? నా మనస్సు నొవ్వకుండా వాడు మసలుకుంటున్నప్పుడు వాడికిష్టం లేని పని నన్నెలా చేయమన్నావో చెప్పు?"

పిన్ని ప్రశ్న వేసి ఆగింది. క్షణకాలం ఉమకీ ఏమనటానికీ పాలు పోయింది కాదు. కొంతసేపు ఏమేమో మననం చేసుకొని అంది.

"–కాని పిన్నీ, ఆ పిల్ల వల్ల ఏం తప్పుందో నాకింకా తెలియదు --- ఆ పిల్ల వల్ల తప్పుందనేటట్టు అయితే – అది చుట్టాలూ, పక్కాలూ, ఊరూ వాడా తెలిసేటట్టు యిలా ఇంత బహిరంగ శిక్ష వేయడానికి తగినద య్యుండదు?"

ఉమ తన జవాబుతో పాటు సూటిగా తన పినతల్లి కళ్ళలోకి చూడ సాగింది. సుందరమ్మగారు ఈ జవాబు అర్థం చేసుకోటానికి కాస్తకాలం తీసుకొన్నారు. అర్థమవగానే ఆమె మరి మాటాడలేకపోయారు. ఉమ మళ్ళా అంది.

"ఒకవేళ అది గొప్ప నేరమే అను. అయినా అది చేసినది అభం శుభం ఎరుగని బిడ్డ. అట్టి బిడ్డమీద ఇంత కఠినత్వం పూనటం తగునంటావా? తగుననే అను – అయితే అది నీవంటి దానికీ వాడివంటి వాళ్ళకు కూడా తగునంటావా?"

ఉమ మాటలు ఒక్కొక్కటీ ఒక్కొక్క అస్త్రమై చివరి వాక్యం సమ్మోహనాస్త్రం కాగా సుందరమ్మగారు అప్రతిభులై ఊరుకున్నారు. ఉమ కూడా కొంతసేపలానే ఊరుకుని తిరిగి కన్నీటిని చీర చెరుగుతో అద్దుకొని దుఃఖాన్ని దిగమ్రింగుతూ

"అది నా ఆడబడుచు కాదు పిన్నీ! కూతురు" అంది కంపించే గొంతుతో.

సుందరమ్మగారు కరిగిపోయిన గుండెతో అన్నారు.

"నేను నిజంగా చెపుతున్నానమ్మా, నేనింత అనుకోలేదు! ఇందులో అబద్ధం ఏమైనా వుంటే నువ్వు వేసిన వట్టు!

ఏదో పండుగకు అలిగి వెళ్ళడం మానేశాడంటే మానేశాడనే అను కున్నాను. కానీ ఇందులో ఇంత గొడవ వుందని నేనేమాత్రం ఊహించినా ఇలా చెయ్యను. నేనే కాదు వాడైనా ఇలా చేసి ఉండడు. ఒకవేళ చేసినా – నిజంగా చెపుతున్నాను– నేను స్వతంత్రించి ఉందును".

ఉమ జవాబివ్వలేదు. పిన్ని కూడా మరేమీ మాటాడలేదు. వాకిట్లో ఎంగిళ్ళు ఏరుకుంటున్న కాకులు కూడా ఎప్పుడెగిరి పోయాయో ఎగిరి పోయాయి. మబ్బు విడిచిందేమో ఒక్కసారి మధ్యాహ్నపుటెండ కనులు మిరుమిట్లు గొలుపుతోంది. దూరాన చెట్టుపై కాకి అరుస్తున్నట్టుంది. ఉమ పినతల్లి వంక దృష్టి తిప్పుతూ అంది.

"తప్పున్నప్పుడు శిక్షించవచ్చు పిన్నీ! కానీ ఆడపిల్లను పుట్టింట ఉంచి శిక్షించడం కూడదు. నీ ఇంటికి తెచ్చి ఏమైనా చెయ్ – కాదనను".

పినతల్లి ఏమీ జవాబివ్వలేదు. కొంతసేపు వరకూ ఎవరూ మాటాడ లేదు. తర్వాత సుందరమ్మగారే తేరుకొని తొందరగా భోజనం ముగించ సాగారు.

12

నాల్గవనాడు పగలు పది గంటలకల్లా జానకి అత్త వెనుక బండి దిగింది.

ఆనాటి మధ్యాహ్నపు ఉమతోడి సంభాషణతో సుందరమ్మగారు పశ్చాత్తప్తులై మర్నాడే కోడలిని తీసుకురావడానికి ప్రయాణమయ్యారు. బండి ఎక్కుతూ మళ్ళా అన్నారు.

"సరే. ఎందుకైనా కీడెంచి మేలెంచడం మంచిది. వాడు లేనప్పుడు నీ మాటమీద నేను బయలుదేరుతున్నాను. ఒకవేళ ఎందుచేతనైనా వాళ్ళు ఇప్పుడు పిల్లను పంపటానికి కాదంటారనుకో. ఏం చెయ్యమన్నావ్??"

ఉమ అంది–

"నీకా సందేహమేల పిన్నీ! దైవికమైన ఆటంకమేదైనా వస్తే చెప్పలేను, లేకపోతే తప్పక పంపుతారు. అలా జరగనప్పుడు మామగారితో గాని ఆయన లేకపోతే జానకితో గాని నేనిక్కడున్నానని చెప్పు. జానకి నీ వెంట వచ్చి

తీరుతుంది. కాని నువ్వు వెళ్తున్నది నీ కోడల్ని తీసుకు రావడానికి. ఆ మాట మాత్రం మరిచిపోకు".

పిన్ని నవ్వుతూ బండి ఎక్కింది. బండి అరవై గజాలు పోయింది. ఉమ లోనికి పోతున్నదల్లా వెనుదిరిగి మనిషిని పంపి బండి ఆపించి తను దగ్గరకు వెళ్లాక అంది.

"నేనిక్కడున్నాననే విషయం అనవసరంగా చెప్పకు"

పిన్ని విచిత్రంగా చూస్తూ అంది.

"అదేమిటే, ఇప్పుడు చెప్పమన్నావు?"

"అవసరమైతేనే చెప్పు, లేకపోతే ఊరుకో" పిన్ని ఇంకా బోధపడక అంది.

"నన్ను అబద్ధం ఆడమన్నావా?"

ఉమ నవ్వుతూ–

"నేనలా చెప్పలేదే. నిజం చెప్పవద్దన్నాను" అంటూ తన స్థానం నుంచి కదలలేదు. పిన్ని మళ్ళా అంది.

"చెబితే వచ్చే నష్టమేమిటే?"

ఈసారి ఉమ సరిగా జవాబిచ్చింది.

"ఇది అని చెప్పలేను. అలా అనడానికో కారణం ఉంది. అది యిప్పుడు చెప్పటానికి అవకాశం లేదు".

సుందరమ్మగారు మరికాస్తసేపాలోచించి 'సరే' అంటూ బండి తోలించారు.

ఉమ చెప్పినట్లే మూడవ నాటికల్లా కోడలితో తిరిగి వచ్చారు.

వారు వచ్చిన అరగంటకు పొలం నుండి వీర్రాజుగారు వచ్చి కోడలి రాక వింటూనే లోనికి వెళ్ళి "ఏమమ్మా వచ్చేశావా... ఇన్నాళ్ళు చేసేశావేం..." అంటూ అక్కడి వారందరి యోగక్షేమాలూ వైనాలవారిగా అడిగి తెల్సుకొని "... నీ మొగుడు చూశావా వారం రోజులై వెళ్ళి పోయాడు. అక్కడ కవితా సభలో, ఏవో జరుగుతున్నాయట. నేటివరకూ ఫికర్లేదు..." అంటూ కోడలు సిగ్గుతో తలవంచుకోవడం గమనించి అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం భోజనాలయ్యాక ముసలాళ్ళిద్దరూ నిద్రపోతున్నారు. పిల్లలంతా చదువుకునే వాళ్ళు చదువుకుంటూంటే, ఆడుకొనే వారు ఆడు కుంటున్నారు. సుమిత్ర ఆ పూట పాఠానికి ఎగనామం పెట్టి వదినగారి వెంట పడింది.

ఉమా, జానకీ, సుమిత్రా రాజశేఖరం గదిలో ప్రవేశించారు.

గదిలో దక్షిణపు గవాక్షం వద్ద ఎత్తయిన పరుపులతో పరిశుభ్రమైన దుప్పటలతో పూర్వకాలపు నగిషీ పనితోడి పందిరి మహాలు మంచం వుంటుంది. ఈశాన్య మూలను ఒక టేబిలూ, కుర్చీ. వాని ననుసరించే పెద్ద బీర్వా ఉన్నాయి! టేబిల్ మీద పుస్తకాల అరలో తరుచు ఉపయోగంతో ఉండే పుస్తకాలు పేర్చబడ్డాయి. టేబుల్‌మీద – ఓ వంకగా వ్రాత పరికరాలు అమర్చబడి ఉన్నాయి. మంచం కెదురుగా ఉన్న గోడను ఎత్తయిన నిలువుటద్దం. సరసనే బట్టల స్టేండూ. గోడలను అన్ని తెగలకు చెందిన చిత్రపటాలూ కానవస్తాయి.

ఉమ వెళ్తూనే పుస్తకాల అరలోంచి ఒక పుస్తకం ఎంచుకొని అక్కడే ఉన్న కుర్చీలో కూర్చుంది.

జానకి కొంతసేపు ద్వారం దగ్గరే నిలవబడి తర్వాత మంచం ప్రక్కనున్న మడత కుర్చీలో కూర్చుని దిక్కులు చూడసాగింది. సుమిత్ర కొంతసేపు పుస్తకాలు తిరగవేసీ, నిలువుటద్దంలో నీడ చూచుకుంటూనూ, పటాల వంక చూస్తూనూ కాలం గడపసాగింది. అసలు సంగతి అక్కా వదినా ఏమైనా బాతాఖానీ వేస్తారేమో విందామని వచ్చింది. వాళ్ళింకొకలా ఉండేసరికి కొంతసేపయ్యాక అక్కణ్ణించి కదిలి వెళ్ళి పోయింది.

పావుగంట తర్వాత ఉమ అకస్మాత్తుగా పుస్తకం పక్కనపెడుతూ అడిగింది.

"నేనిక్కడ ఉన్నానని పిన్ని యింటిదగ్గర చెప్పిందా?"

జానకి తల ఊపుతూ,

"ఊఁహు. నాకైనా త్రోవలో ఏదో మాటల్లో చెప్పారు..." అని క్షణమాగి తర్వాత "ఇంటి దగ్గర ఏమైనా గొడవ జరిగిందా అని అడిగారు".

తర్వాత సంగతి జానకి చెప్పలేదు. ఉమ కూడా కాస్త ఊరుకొని అడిగింది.

"నువ్వేం చెప్పావ్"

"నే నూరుకున్నాను. ఆమె ఏమనుకున్నారో మళ్లా అడగలేదు"

ఉమ కొంతసేపటి వరకూ మళ్లా ఏమీ ప్రశ్నించలేదు. ఆ జ్ఞాపకాలూ, ఆ మౌనం ఇద్దరికీ చాలా యిబ్బందిగా ఉంది. ముఖ్యంగా జానకికి. పోనీ మాటాడదామంటే ఏం మాటాడాలో తెలియదు. చివరకు తనకెప్పుడో కలిగిన ఒక సందేహం జ్ఞాపకంరాగా దానిని శరణు చొచ్చింది.

"వదినా! ఇంగ్లీషు చదువుట వల్ల లాభం ఉన్నా లేకపోయినా నష్టం ఉందా?"

జానకి ప్రశ్నించి ఊరుకుంది. కొంతసేపటి వరకూ ఉమ వినిన జాడే కానరాలేదు. తర్వాత ఉమ అంది.

"దానికి నేను సూటిగా జవాబివ్వలేనమ్మా?" అని

కాస్తసేపాగి "పన్నెండేళ్ళ క్రిందట నేను థర్డుఫారం చదువుతుండేదాన్ని. మీ ఆయన కూడా అప్పుడు మా యింటే ఉండి చదువుకుంటుండే వాడు. వాడు కూడా అప్పుడు ఆ తరగతే. మాకు రామనారాయణ గారని ఒక మేష్టరు గారుండే వారు. ఆయన సంగతి చెప్పాలంటే చాలా వుంటుంది. ఆయన మాకు చరిత్ర పాఠం చెప్పేవారు. ఆయనకు గుడ్డెద్దు చేను మేతంటే తగని మంట. ఆయన ఒకసారి ఏదో చెపుతూ అన్నారు.

'ఇంగ్లీషు చదువులకు ఇలా భూములమ్మీ, పుస్తులమ్మీ ఎగబడు తున్నారు – ఏలా?' అన్నారు.

ఆయననేది ఉద్యోగం కోసం తప్పిస్తే ఇంగ్లీషు ప్రయోజన రహితమని, అందుచేత ఉద్యోగం అవసరం లేని వారు ఇంగ్లీషు చదవడం వల్ల ఉపయోగం లేకపోవడమే కాకుండా జాతికి అది ద్రోహమని".

జానకికి వదిన జవాబుపై అనేక సందేహాలు బయలుదేరాయి. కాని ఆమె నోరు తెరచి అడగకుండా గ్రహించి తీర్చే బాధ్యత తన మౌనం ద్వారా ఉమపై విడిచి ఊరుకుంది.

"ప్రతి జాతికీ ఒక భాషా, ఒక సంస్కృతీ వుంటాయి. మన భాషనూ, మన సంస్కృతినీ వ్యాప్తిలో వుంచవలసిన బాధ్యత మన అందరి మీదా ఉంటుంది. దానిని అశ్రద్ధ చేసి పరాయి వానిని పోషించటం ఎంత చేయదగిన పనో, 'మీరే చెప్పండి' అంటారాయన".

ఉమ ఆగిపోయింది. జానకి యుక్తి ప్రయుక్తులాలోచిస్తుంది. ఉమ అంది.

"మీ ఆయన ఆ యాడాది చదువు మాని వేయటానికి ఆ మేష్టరు గారి ఉపన్యాసాలు ఒక కారణం, ఇంక నేను మానివేయడానికి కారణం మీ ఆయన".

ఉమ ఎందుకో నవ్వింది. జానకి కొంతసేపు ఊరుకుని అడిగింది.

"మరి నువ్వు సంస్కృతం చదువుకోలేదేం?"

"అయ్యో అదీ ఒక ఆరుమాసాలు వెలిగించాను. తర్వాత మీ ఆయన ఆ ఊరు విడవటంతో ఆగిపోయింది".

మళ్ళా కొంతసేపటి వరకూ ఎవరూ మాటాడలేదు. జానకి మరొక ప్రశ్న వేసింది. "కాని మన చదువులో ఇప్పటి ప్రపంచానికి సంబంధించిన జ్ఞానం ఉంటుందా?"

ఉమ వెంటనే జవాబివ్వలేకపోయింది. తర్వాతైనా – "జీవితానికి అవసరమైన ప్రపంచ జ్ఞానం ఇంగ్లీషు చదువుకోకపోయినా తెలుగులో వ్రాయబడిన ఈనాటి గ్రంథాల మూలంగానే తెలుసుకోవచ్చు..."

ఉమ ఆగిపోయింది. ఇద్దరూ ఏమేమో ఆలోచిస్తూ అలా చెరో కుర్చీలోనూ కూర్చున్నారు.

ఉమ ఆలోచించి ఆలోచించి అంది.

"విజ్ఞానం బహుముఖం. ఏ ఒక్కరూ అన్ని రంగాలలోనూ పూర్తి విజ్ఞానం సంపాదించలేరు. ఏదో తమకు సాధ్యమైన దానిలోనే – లేక ఇష్టమైన దానిలోనే, సంపాదించ గలుగుతారు. ప్రతి రంగానికి సమానమైన గౌరవమే ఉంటుంది. కాని జనాభిమానం ఎక్కువగా పొందేదే ఉన్నతమైనదని అనుకుంటాం. ఇంగ్లీషు చదువుకుంటేగాని విజ్ఞానం, సంస్కారం లభించవని చాలామంది నమ్మకం. అసలు చదువుకీ, వాటికీ సంబంధం లేదు. ఉన్న కాస్తలోనైనా వాటిని సంపాదించటానికి ఇంగ్లీషే చదువుకొని ఉండనక్కరలేదు. ఎందుచేతంటే అవి భాష నేర్చుకొనే తరగతి పాఠాలలో లభింపవు. ఆ భాషలోని ఉద్గ్రంథాలు చదవటం వలన లభిస్తాయి. ఉద్గ్రంథాలు ప్రతి భాషలోనూ ఉంటాయి. ఎందులో ఉన్నా, లేకపోయినా మన భాషలో చాలా ఉన్నాయి. అందుచేత సంస్కారం, విజ్ఞానాల కోసరం మనం ఇంగ్లీషే చదవనక్కరలేదు".

ఉమ ఆగిపోయింది. తను చెప్పింది జానకికి అర్థమయ్యిందో లేదోగాని ఆమె మాత్రం చాలా శ్రద్ధగా వింది.

కొంతసేపు పోయాక ఉమ అడిగింది.

"అసలు నీకిట్టి సందేహం ఏల కలిగింది?"

జానకి కొంతసేపు ఏమీ లేదంటూ కారణం చెప్పకుండా తప్పుకోటానికి ప్రయత్నించింది. కాని ఉమ బలవంతం మీద చెప్పక తప్పింది కాదు.

"సుమిత్ర సరదాపడి నాలుగుసార్లు ఇంగ్లీషక్షరాలు నేర్చుకుంది. తర్వాత.. తర్వాత మానేసింది".

ఉమ ఆ రెండు 'తర్వాత'లకూ మధ్య ఏర్పడిన గండికి కారణం సులభంగానే ఊహించుకోవడం చేత మౌనంగా ఊరుకుంది.

13

ఉమా, జానకీ దొడ్లో స్నానాలు చేస్తున్నారు. సుమిత్ర పరుగెత్తుకుంటూ వచ్చి రాజశేఖరం ఆగమనాన్ని తెలిపింది. దగ్గరలో వున్న ఉమ కూతురు సరస్వతి 'మామయ్యోయ్ – మామయ్యోయ్' అంటూ పరుగెత్తింది. ఉమ మరదలి వంక చూచి ఆమె గుండెలు కొట్టుకోవడం దూరం నుంచే వింది.

స్నానాలయాక కూడా జానకి వెనుకటింటే ఉండిపోయింది. ఉమ మాత్రం తలనూనె సీసా కోసరం లోనికి వచ్చింది.

రాజశేఖరం నట్టింట మంచంమీద కూర్చుని తల్లితో

మాటాడుతున్నాడు. పిల్లలు అతడు తెచ్చిన మిఠాయి పంచుక తింటున్నారు.

ఉమ ముఖాన గంభీర ముద్రతో ఈ వంకా ఆ వంకా చూడకుండా తిన్నగా లోనికి వెళ్లిపోతోంది. కృతజ్ఞురాలైన ఉమ కూతురు 'అమ్మా మామయ్యే' అని ఆమె కర్తవ్యాన్ని జ్ఞాపకం చేసింది కూడా. అయినా ఉమ వినిపించుకోలేదు. రాజశేఖరం ఆమె ననుసరించే కొంతసేపు చూచి తరువాత చూపులు భూమి వంక త్రిప్పుకున్నాడు.

అచిరకాలంలోనే ఉమ చేతిలో సీసా దువ్వెనా అద్దాలతో తిరిగి వారి మధ్య నుండి పోతోంది.

సుందరమ్మగారు తమాషా చూస్తున్నప్పటి వలె చిరునవ్వుతో చూస్తూ గడ్డం చుట్టూ మునివేళ్ళు చేర్చి తల కాస్తగా ఊపుతూ 'ఏం జాణ తనమే మా అమ్మా' అంది స్వగతంలా.

ఉమ కళ్ళెం వేసినట్టు ఆగి కుటిల భ్రుకుటితో పోట్లాటకు పోయే దానిలా మీది మీదికి పోతూ "ఏం అమ్మా? ఏం చూశావు, నా జాణతనం? చెపుదూ కాస్త!" అంది తల తాటిస్తూ.

సుందరమ్మగారు కోపం నటించడం చేతకాకపోగా నవ్వు కూడా దాచుకోలేకుండా–

"జాణతనం కాదుటే? వాడు నీ మీద కోపగించవలసింది పోయి, ఎదురు నువ్వు వాడిమీద కోపం చూపిస్తున్నావ్?" అన్నారు.

"కోపం? ఎవరి మీద? ఎందుకు? ఏం చేశా మనమ్మా?"

సుందరమ్మ నిరుత్తరయై కొడుకు వంక తిరిగి అన్నారు.

"చూశావురా దీని ఆగడం!"

కొడుకు చూస్తూనే వున్నాడు. ఇంకో అప్పుడైతే తల్లి కోరకుండానే ఆమెకు అడ్డుపడే వాడు కూడా. కాని ఆనాడు తల్లి నోరువిడచి అడిగినా అతడు సహాయ నిరాకరణం చేస్తూ ఊరుకున్నాడు. ఆ మౌనానికర్థం తల్లీ కూతుళ్ళిద్దరికీ అర్థమయ్యింది. అయినా ఉమ ధైర్యం వహించి అంది.

"ఆగడం నాది కాదు పిన్నీ. ఆ మాటకు అర్థం తెలియక నువ్వంటు న్నావు. ఆగడం, అత్యాచారం అంటే ఏమిటో ఆ పండితుణ్ణడుగు – చెపుతాడు"

ఇలా అంటూనే ఆమె పెరటిలోనికి వెళ్ళిపోయింది.

రాజశేఖరానికీ, ఉమకీ వయసులో ఒక్క సంవత్సరమే తేడా. ఉమ చిన్నదే అయినా రాజశేఖరాన్నే నాడూ గౌరవించి ఎరుగదు. చిన్నప్పుడు పోట్లాటల్లో చేతకాకపోతే నోటికి వచ్చినట్టు తిట్టి సాధించేది. రాజశేఖరం కూడా మించి వచ్చినప్పుడు మాట్లాడ్డం మానేసి సాధించేవాడు. సుందరమ్మ గారా పాతికేండ్లలో ఇట్టి పోట్లాటలెన్నో చూశారు. కాని ఆమె ఎన్నడూ భయపడలేదు. ఇవాళ మాత్రం ఆమెకు ఎందుకో జంకు వేసింది.

మధ్యాహ్నిక భోజనాలు పరిసమాప్తి కాగానే ఉమ నిద్రపోవటానికి ప్రయత్నించింది. కాని ఆమె అస్వస్థచిత్తం నిద్రపోనిచ్చింది కాదు. కొంతసేపు ఇటూ అటూ దొర్లి చివరకు లేచి రాజశేఖరం గదిలోకి వెళ్ళింది.

రాజశేఖరం నిద్రపోవటం లేదు.

ఉమ వెళ్ళి మాటా పలుకూ లేకుండా టేబిల్ వద్ద కుర్చీలో కూర్చుంది. చివరకు రాజశేఖరమే మాట్లాడాడు.

"దొడ్డమ్మా వాళ్ళూ క్షేమమా?"

"నీ దయవల్ల".

అంతే మళ్ళా కొంతసేపటి వరకూ ఎవరూ మాటాడలేదు. రాజశేఖరం ఎదురుగా తెల్లని గోడమీద దారితప్పి తిరుగుతున్న ఎఱ్ఱ చీమ వంక చూస్తూ ఉంటే ఉమ కుడిచేత బొటన వ్రేలి గోరును తీరుగా కొరుకుతోంది.

చివరికి ఉండి ఉండి ఉమ అడిగింది.

"అవునయ్యా, నీకేం హక్కు వుందని అట్టి ఆజ్ఞ వేశావ్"

రాజశేఖరం నెమ్మదిగా అడిగాడు. అతని గొంతుక బహుశాంతంగా ఉంది "ఎట్టి ఆజ్ఞ"

"ఆమెను నువ్వు చెప్పేవరకూ తీసుకరావద్దని".

రాజశేఖరం క్షణకాలం తాళి అన్నాడు. అతని చూపు ఉమ వంక కాక ఎక్కడో ఉంది.

"అవును అందులో తప్పేముందీ?"

"ఆమె తన యింటికి రావడానికి, నీ అనుజ్ఞ ఏమిటయ్యా వేషం కానీ!"

రాజశేఖరాన్ని ఏ మాట నొవ్వసేసిందో ఏమో – విచలిత ప్రసన్నుడై ఉమ వంక చూస్తూ నిశితపర్వంతో అన్నాడు.

"ఇది ఆమె యిల్లే అయితే, ఆమె ఇంటికామెను పిలవటం ఏలా?" ఉమ కొంతకాలం వరకూ మాటాడలేకపోయింది. ఎంతకాలం వరకు అంటే రాజశేఖరం కండ్లలో మళ్ళా శాంతం కానవచ్చేదాకా అప్పుడంది.

"అయితే, యిది ఆమె యిల్లు కాదంటావా?"

"అవునూ కాదూ అంటున్నది నే కాదు"

ఉమ అంతరాంతంలోకీ మాట ప్రవేశించేసరికి గక్కురుమంది. క్షణ కాలం ఊరుకుంది. పిదప హీనస్వరంతో అడిగింది.

"ఇంకొకరు మాత్రం అంటున్నారా?"

రాజశేఖరం వెంటనే జవాబివ్వలేదు. అతడబద్ధం ఆడలేదు. అందుచేత ధర్మరాజు చూపిన మార్గాన పోయాడు–

"నోటితో అనలేదు" అది వినగానే ఉమకెందుకో పట్టరాని రోషం వచ్చింది. తీక్షణంగా అంది.

''నువ్వు సర్వాంతర్యామివా – మనోగతాలు తెల్సుకోవటానికి?"

కాని రాజశేఖరం చలించకుండా అన్నాడు.

"ఆ మాత్రపు పనికి సర్వాంతర్యామి కానక్కరలేదు. ఆ విషయమటు ఉంచు. మనోగతాలు తెలుసుకోవడానికి వాక్కు తప్ప ఇంకొక నమ్మదగ్గ సాక్షి లేనట్టు మాటాడుతున్నావు. అది పొరపాటు. మనుష్యులు బట్ట కట్టని స్థితిలో వారి మనోగత విషయాలు వారి వాక్కు ద్వారా తెలుసుకోవచ్చు. అదే ఆధారం కూడా. కాని బట్టకట్టి తిరిగే వారు తమ నగ్న శరీరాలను కప్పే బట్టలు లానే వాక్కును తమ మనస్సులను దాచడానికి మాత్రమే ఉపయోగిస్తారు. అందుచేత మనుష్యుల మనోగతాలు తెల్సుకోవటానికి నువ్వన్నట్టు నోటితో చెప్పిన దానిని నమ్మటం మార్గమే కాదు".

రాజశేఖరం ఆగిపోయాడు.

ఇప్పుడు ఉమ ఇరుకున పడింది. సంగతేమంటే ఆమె ఈ అతిలోక దంపతుల నడుమ కలతకు కారణాన్నూహించటంలో ఇంతవరకూ తాను తప్పుదారే పడుతూ వచ్చినట్టు రాజశేఖరం మాటలతో ఆమెకు సందేహం కలిగింది. అందుచేత ఏ మాటంటే కథ ఎటునుండి ఎటు తిరుగుతుందో అనే భయం పట్టుకుంది. ఏతావాతా ఆమె మౌనం వహించి వినసాగింది.

రాజశేఖరం ఎక్కడికో చూస్తూ చెప్పసాగాడు– "జీవుల మీద పరిసర ప్రాబల్యం అమోఘమైనది. ఒకవిధమైన పరిసరాలకు అలవాటుపడ్డ వారు – విభిన్నమైన పరిసరాల్లో సుఖజీవనం సాగించలేరు.

నువ్వు హంసబకోపాఖ్యానం వినే ఉంటావు. మానస సరోవరం నుండి దారితప్పి తిరుగుతున్న హంసను చూచి కొంగలు అడిగాయట 'ఎవరయ్యా నువ్వూ' అని. హంస చెప్పింది. ఎక్కణ్ణుండి వస్తున్నావన్నాయి. దానికి జవాబిచ్చింది. మానస సరోవరంలో ఏం దొరుకుతాయన్నాయి. 'బంగారు తామరలూ, మంచి ముత్యాలూ' అంది. కొంగలు వినిపించు కోకుండా 'నత్తగుల్లలు దొరకవా' అన్నాయి. హంస 'అవేమిటో నాకు తెలియవంది' కొంగలు మానస సరోవరం యొక్క దారిద్ర్యానికీ అట్టిచోట నివాసం చేసే హంస దౌర్భాగ్యానికీ పకపక నవ్వాయట".

ఉమ ఈ ఒక్క ఉపమానంతో సర్వం అర్థం చేసుకుంది. అయినా ఆమె మరికొంత తెలుసుకునే వరకూ ఏమీ మాటాడదల్చుకోలేదు. కొంతసేపుండి రాజశేఖరమే మళ్ళా ఆరంభించాడు.

''ఒకవేళ నువ్వు బకపక్షపాతివి – కాదంటే న్యాయపక్షపాతివే అను – అయితే ఒక ప్రశ్న వేయవచ్చు. నత్తగుల్లలకన్నా మంచి ముత్యాలు ఉత్కృష్టత నీకూ నాకూగాని కొంగకేముంది. అది నిజమే. అందుచేతే నేనంటాను "నత్తగుల్లలకన్నా మంచి ముత్యాలు ఉత్కృష్టమైనవి ఎట్లాకావో, అట్లాగే నత్తగుల్లలూ మంచి ముత్యాలకన్నా ఉత్కృష్టమైనవి కావు!"

రాజశేఖరం ఆగాడు. ఉమకు పరిస్థితి పూర్తిగా అర్థమయ్యిందేమో నోరు విప్పింది –

"– అని నాకు బోధించి ఏం లాభం".

రాజశేఖరం నిరుత్తరుడై ఊరుకున్నాడు. కొంతసేపు ఇరువురూ నిశ్శబ్దంగా ఉన్న పిదప ఉమ అంది.

"కొంగకు నవ్వటం వచ్చునా?"

రాజశేఖరం జవాబివ్వలేదు. ఉమ ఏదో అనబోతుంటే అప్పుడన్నాడు.

"నవ్వటమంటే నోరు తెరచి హఁహ హఁహ అన్నదే నవ్వు కాదు".

ఈసారి ఉమ జవాబివ్వలేదు. ఆమె తన వంక చూడని రాజశేఖరం ముఖంలోకి చూసి చూసి అంది.

"అన్నయ్య కాబోలు ఒకప్పుడు నాకో విషయం గూర్చి బోధిస్తూ అన్నాడు–" అని అతడు సావధానుడైన పిదప పూర్తిచేసింది "– ఆత్మన్యూనతా శంఖచే (ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్) బాధపడేవాళ్ళు ప్రతి స్వల్ప విషయానికీ విచక్షతా శూన్యంగా తమ్ము తాము హింసించుకుంటారు – అన్నాడు. దానికి నేను యింకోమాట చేరుస్తాను. అంతేకాదు, ఎదుటి వాళ్ళను కూడా హింసిస్తారు".

ఇలా అంటూనే ఆమెలేచి బయటకు వెళ్ళిపోయింది. రాజశేఖరం అలా చూస్తూ ఊరుకున్నాడు.

14

మరునాడుదయమల్లా రాజశేఖరం తన గదిలోనే ఉన్నాడు. రోజూ ఏదో పుస్తకం తీసి చదివే వాడు. కాని ఆవాళ అదీలేదు. పది గంటలప్పుడు ఉమ మళ్ళా వచ్చి టేబిల్ వద్ద కుర్చీలో కూర్చుంది. రాజశేఖరం ఒకసారి ఆమె వంక చూడటం మాత్రం చూశాడు. అయితే ఆ చూపులో ఆవాహనా లేదు, విసర్జన అంతకన్నా లేదు.

ఉమ వేనినీ లక్ష్యపెట్టకుండా ఆరంభించింది.

"అవునయ్యా కొంగలు నవ్వాయి! అలానే అంగీకరిస్తాను. అయితే అది వాటి అజ్ఞానాన్ని తెలియచేస్తుంది. కాని హంస ఆ నవ్వుచే గాయపడి కొంగలపై కోపం తెచ్చుకున్నా, వాని నసహ్యించుకున్నా లేక మీ నత్తగుల్లలకన్నా నా మంచి ముత్యాలు ఎట్లా హీనమైనవని పోట్లాటకు దిగినా – దీని సంస్కారమేదీ మరి!"

ఉమ జవాబు కోసరం ఆగింది. కాని రాజు మాటాడక పోయేసరికి మరొక ప్రశ్న వేసింది...

"అంతేకాదు వీటితో నాకేమని ఊరుకోవటం కూడా హంస అసమర్థతతో పాటు కర్తవ్యాన్నుపేక్షించటం తెలియచేస్తుంది".

ఉమ ఆగింది. కొంతసేపు పోయాక మళ్ళా ఏదో అనబోతోంది. అది గమనించి రాజశేఖరం వ్యంగ్య స్ఫురద్ధరహాసంతో ఆమె వంక చూస్తూ అడిగాడు.

"అయితే యీ యుక్తులన్నీ ఆలోచించటానికి ఒక రాత్రీ ఒక పగలూ పట్టిందా?"

"లేదు లేదు.. నెల్లాళ్ళూ... ఏకాంతంగా మడత కుర్చీలోపడి ఆలోచిస్తేనే గాని స్ఫురించలేదు".

ఉమ అకస్మాత్తుగా రోషాసక్త కాసాగింది. మొదట జవాబు ఆరంభించే సరికి ఏమీలేదు, ఒక్కొక్క మాటే అంటుంటే రోషం పెరగసాగింది.

"నీకు ఆడవాళ్ళంటే ఉంటూ వచ్చిన చులకనభావం యింకా పోలేదు. నీ మాటల్లో నీ ప్రతి వాక్యంలో అదే కానవస్తుంది. నీవేదో గొప్ప పండితుడవనుకుంటున్నావ్. నలుగురూ ఉత్తముడనేసరికి అందరూ నీ కంటికి హీనంగా కానవస్తున్నారు. నిజానికి నీవంటి మూర్ఖుడు ఇంకొకడు లేదు" అని క్షణమాగి–

"నువ్వు చదువుకున్నావనే అనుకున్నాను కాని నీ ఛాందసపు చదువు నిన్నిలా ఛాందసుణ్ణి చేసి విడుస్తుందనుకోలేదు–" అంటూనే అకస్మాత్తుగా ఆవరించే కోపంతో "ఆమె వల్ల ఏం నేరముందని ఇలా శిక్షిస్తావూ? మగవాడి నని కదా...?'' అంటూ అక్కడి నుండి పిడుగులుమియ సాగింది.

"ఆమె వల్ల తప్పుంటే భరించవలసిందెవరూ? నీ భర్తృత్వానికి అర్థమేమిటి?

ఆమెను పుట్టినింట దిగవిడిచీ, వారు మర్యాదగా పండుక్కి పిలుస్తే వెళ్ళకపోయీ– ఆమెనూ, వారినీ బాగుచేస్తావా? ఇదేనా నీ తెలివితేటలు? నీకు తెలియకపోతే పెద్దవాళ్ళు చెప్పేదైనా వినవద్దూ. నాన్నగారి మాటను కాదనడానికి నీకు ఎన్ని గుండెలూ? నీకా అహంభావం ఏలా? ఏమి చూసి"

అని అదత్త ప్రతివచనయై,

"ఒకవేళ నీకొక ఉద్దేశం ఉండవచ్చు – నీకున్న మడిమాన్యాలు చూసి – నీకు పిల్లనిచ్చామనుకుంటున్నావేమో. మేమైనా అంత గతిమాలి లేము. నీకు పిల్లనిచ్చింది డబ్బుచూసి కాదు. నీ యింటి మర్యాదచూసి, పిన్ని మొహం చూసి. నువ్విట్టి పండితుడవు కాకముందు నీ వ్యక్తిత్వాన్ని చూసి. ముఖ్యంగా నువ్వింత నీచుడవైనా యింకా చావని నీమీది నా మమకారం చేతా".

ఇలా అంటూనే ఆమె తన కన్నీళ్ళు దాచుకొనటానికి గిరుక్కున వెనుతిరిగి వెళ్ళిపోబోయింది. ఉమ ఉన్నతస్వరం విని వచ్చి ద్వారం దగ్గర నిలచి ఉన్న సుమిత్రా, మరికాస్త ఎడాన ఉన్న జానకీ, ఒరిగి దారిచ్చారు.

నిస్తేజములైన కండ్లతో ఉమ వెంటనే చూస్తూ ఉన్న రాజశేఖరం కండ్లు క్షణకాలం జానకి భీతిలోచనాలతో కలుసుకున్నాయి. తర్వాత జానకి కూడా అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

రాజశేఖరం ఆ పూటల్లా మడత కుర్చీలోంచి లేవకుండానే గడిపాడు. అతని ఎదుట ఉన్న ప్రశ్న ఒక్కటే. ఉమకంత కోపం తెప్పించే మాట తానేమన్నానా అని. కాని ఉమ వాక్ప్రహరణాలకు దిమ్మెక్కి ఊరుకున్న తలలోంచి గతంలోని ఒక్క జ్ఞాపకాన్ని కూడా బయటికి తీయలేక పోయాడు.

మధ్యాహ్నం భోజనమయ్యాక కూడా అతనలాగే ఉన్నాడు. కుర్చీలో కూర్చుని ఎదురుగా ఉన్న మహాత్ముని పటంవంక చూడసాగాడు.

కొంతసేపటికి పెరటి వరండాలలో భోజనాలు చేస్తున్న ఆడువారి ప్రసంగం వినిపించసాగింది. ఉమ గొంతు మాత్రమే సుస్పష్టంగా వినిపి స్తోంది.

"అవును పిన్నీ! దాని వల్ల లక్ష తప్పులు ఉండవచ్చు. నేను కాదనను. కాని దిద్దుకోవలసింది ఎవరు? అదేల తప్పులు చేయాలంటావేమో – ఎవరైనా తప్పులు చేయకుండా పెద్దవాళ్ళు కాగలిగారా? అసలు మీచేత పెట్టిందెందుకూ? మీ బిడ్డలా చూచుకొని దిద్దుకొనే ఉదారులనే కదా? నువ్వుకాని, వాడుకాని అది తప్పుచేస్తుంటే మందలించారా? మందలించాక కూడా అది దిద్దుకోకపోతే అప్పుడు మీరే చెప్పుతో కొట్టినా న్యాయం ఉంది. అసలు అది చేసిన తప్పేమిటో బయట పెట్టరు?"

తర్వాత తల్లి మాటలు కాబోలు వినిపించలేదు. మళ్ళా

ఉమ---

"అడుగుతే చెపుతుందనే అనుకున్నావా"

"...... ..."

"అత్తింటి గుట్టు దాచిపెట్టే బుద్ధిశాలినులు లోకంలో మీ యింటి ఆడ పడుచులు మాత్రమే అనుకోకు. ఎంత మేము పట్టణవాసులమే అయినా కుటుంబ మర్యాదలలో మీకేమీ తీసిపోము".

"... ... ..."

"కాదూ నీ కొడుకేల చెప్పక పోవాలంటాను?"

"... ... ..."

"సరే ఏకాంతమే అనుకో. అయితే ఆ ఏకాంతంలోనే వాడు ఇది తగదు ఇది మంచి, ఇది చెడ్డ అని హృదయమిచ్చి చెప్పేడేమో అడుగు".

"... ... ..."

"వాడు చెపితే నమ్మనూ? అంత నమ్మకం లేకపోతే బిడ్డనెలా ఇస్తామూ?"

"... ... ..."

"బిడ్డనిచ్చుకున్నాను కాబట్టే దెబ్బలాడతాను. దెబ్బలాడక ఊరు కుంటానా?

నీ కొడుక్కాబట్టి వాడు తప్పు చేస్తున్నా నువ్వూరుకుంటున్నావు. నీ కొడుకు ముల్లు. అరటాకు మీద ముల్లుపడ్డా, ముల్లు మీద అరటాకు పడ్డా ముల్లుకు వచ్చే నష్టంలేదు. నేను నీలా ఊరుకుంటే ఎలా?" క్షణమాగి "నేను వీణ్ణి ఎంత నమ్మాననీ? నా నమ్మకమంతా వమ్ము చేశాడే! పెళ్ళయి ఆడుదాని ముందు నిలవగానే వీడిలా వ్యక్తిత్వం కోల్పోయి యుక్తా యుక్తాలూ ధర్మాధర్మాలూ సర్వం మరచిపోతాడని నేనెప్పుడూ అనుకోలేదు. లేకపోతే వీడిలా చేయవలసిన వాడేనా? ... ... వీడిమీది గౌరవం కొద్దీ చివరకు నా అత్తగారితో కూడా పోట్లాట తెచ్చి పెట్టుకు వచ్చేశాను-"

తర్వాత కొంతసేపటి వరకు ఏమీ వినరాలేదు. మళ్ళా ఉమ గొంతే వినవచ్చింది. కాని స్వరంలో ఆర్ద్రత వినవస్తోంది.

"ఎందుకో ఒకందుకు. మూలం మాత్రం నీ కొడుకే"

మాటలు క్రమంగా అస్పష్టం అవటం చూస్తే ఉమ అక్కణ్ణుంచి వెళ్ళి పోయినట్టు స్పష్టమయింది.

రాజశేఖరం ఏమైనా మూర్ఖుడు మాత్రం కాదు. అతను కళ్ళు మూసుకుని ఆలోచనలో పడ్డాడు.

అకస్మాత్తుగా ఉమ గొంతు వినవచ్చింది నట్టింట-

"విననీవమ్మా నాకేం భయం లేదు" అని కాస్తసేపాగి "వింటే యిప్పటికైనా కళ్ళు తెరచి చూస్తాడేమో" అంటూనే మళ్ళా బయటకు వెళ్ళి పోయింది.

రాజశేఖరం అలానే ప్రక్కకు ఒత్తిగిలి పడుకున్నాడు.

★ ★ ★

ఉమ ఆ రాత్రి తీరికగా ప్రక్కమీద వేనువాల్చి ఆలోచించసాగింది. తను తన జీవితంలో ఎదురుపడిన వారిలో ఎవ్వరితోనైనా ఎప్పుడో ఒకప్పుడు పోట్లాడకుండా విడిచి పెట్టిందా? తను ప్రతివారితోనూ యిలా పోట్లాడటానికి ఏం హక్కు వుంది. వాళ్ళు సంబంధాలు తెంచుకోలేక పడి వుంటున్నారు కాని వాళ్ళు నిజంగా తనకు బుద్ధి వచ్చేటట్టు చేస్తే తను చేసేదేముంది. చివరకు గయ్యాళిగంపనే బిరుదు ఏనాడో ఒకనాడు తనమీద పడి ఊరుకుంటుంది. తను చేతులారా బంధువులూ అత్తమామలూ చివరికి భర్త మనసు కూడా విరుచుకొంటోంది. ఉమ ఏడవసాగింది. అలా ఏడుస్తూనే ఎప్పుడో నిద్రపోయింది.

15

మర్నాడల్లా ఉమ దుర్దినంగానే గడిపింది. మూడవనాడుదయం ఉమ ప్రక్కమీంచి లేచేనరికి వాతావరణంలో ఏదో మార్పు వచ్చినట్టు గమనించ సాగింది.

లేచి ఇవతలకు వచ్చేసరికి - వైశాఖ మేఘాలు వర్షించిన చిహ్నాలు కానవచ్చాయి.

ఆమె ఉత్సాహంతో దిక్కులు చూస్తూ తడిసిన పుటంతో మౌనంగా చలన రహితయై అపూర్వ శోభతోటి భూదేవిని గమనించింది.

ఆ వర్షానికి అదే తొలకరింపు.

ఉమ నూతివద్దకు పోతూవుంటే ముఖం కడుక్కొని వస్తున్న జానకీ, సుమిత్రా ఎదురుపడ్డారు. సుమిత్ర-

"తెల్లవారుజామున వర్షం కురిసిందక్కయ్యా" అంటూ పలకరించింది.

జానకి మాత్రం పైట చెంగుతో తుడిచిన ముఖాన్నే మళ్ళా తుడుచు కుంటూ వదినను తప్పుకుపోయింది. ఏదో కొత్తగా తడబడే పాదాలతో నడిచిపోయే ఆమెను చూస్తూ క్షణకాలం ఉమ అలానే నిలుచుండి పోయింది.

కాఫీలయ్యాయి. జానకి తల దువ్వుకుంటూ వుంటే సోమరిగా కూర్చుని ఆమె వంక చూస్తూ వున్న ఉమ అకస్మాత్తుగా లేచి పిన్ని దగ్గరకు వెళ్ళి-

"నేనివాళ ఇంటికి వెళ్తాను పిన్నీ" అంది.

పిన్ని చేతిలోని పని విడిచి నిచ్చరబోయి చూస్తూ-

"అదేమిటే.... ఏమిటామాట?" - అంటూ అలానే నిలిచిపోయారు. ఉమ ఆమాటకర్థం అదే అంది. ఎంత

చెప్పినా వినదికాదు. 'పోనీ మీ చిన్నాన్న గారు ఊరునుండి వచ్చేవరకైనా ఆగవే' అన్నారు. కాని ఉమ పట్టు విడవలేదు. చివరకు సుందరమ్మగారు కర్తవ్య విమూఢయై గదిలో వున్న కొడుకును పిలవనంపింది. కబురు తీసుకువెళ్ళిన సుమిత్ర తిరిగి వచ్చి–

"బండి దొరకదట" అంది.

ఉమ కుటిల భ్రూకుటితో ఎవరితోనూ ఉద్దేశించకుండా అంది–

"బండి దొకదూ – మహరాజులా దొరుకుతుంది. అవసరమైతే నేను నడవగలను కూడా. నిన్న రాత్రి పొమ్మన్నవాడూ వీడే! ఇప్పుడు ఆటంక పెట్టేవాడూ వీడే!"

సుందరమ్మగారి కదంతా అగమ్యగోచరంగా వుంది. ముఖంచూస్తే ఉమ ఏదో నటిస్తున్నట్టే వుంది. కాని ఆ నటన నిజంకు చాలా దగ్గరలా కూడా వుంది. అందుచేత అంది–

"వాడు పొమ్మన్నాడా?"

ఉమ జవాబిచ్చేలోగా రాజశేఖరం అక్కడికి వచ్చాడు.

"అవున్రా?" అంది తల్లి. రాజశేఖరం మాటాడలేదు. కాని ముఖం స్పష్టంగా చెపుతూనే వుంది.

ఉమ ముఖాన్ని మరింత వికృతం చేసుకుంటూ అంది–

"కావలిస్తే నీ కోడలినడుగు. అదే చెప్పింది".

సుందరమ్మ కోడలి వంక చూసింది. జానకి అర్థంకాక తొట్రుపడుతూ తనకు తెలియదంది.

ఉమ చప్పున లేస్తూ "నీకంటే కృతఘ్నురాలీ లోకంలో వుండబోదు" అంటూ అవతలికి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళాక తల్లి మళ్ళీ రాజశేఖరాన్నడిగింది. రాజశేఖరం ఒక వంక సిగ్గుతో, యింకోవంక చిరునవ్వుతో తల్లి అమాయకతకు జాలికూడా కలియగా అన్నాడు–

"అది పుట్టినప్పటి నుండీ చూస్తున్నావు. ఎన్నడైనా నిజమాడిందా అమ్మా?"

సుందరమ్మగారి గుండె అంతట కుదుటపడింది. కాని జానక్కి మాత్రం ఒకనాడు రాజశేఖరం అర్థం చెప్పిందాకా ఉమ తనను కృతఘ్నురాలనటానికి కారణం బోధపడింది కాదు. ★

(భారతి: నవంబరు, 1950)